# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..


15.01.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 191 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









# తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి

- భోగిమంటలు వేసిన ప్రజలు
- భోగి వేడుకల్లో ప్రముఖులు
- ఏపీలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు
- భారీగా తరలిచ్చిన తెలుగు రాష్ట్రాల వీక్షకులు
- ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు

తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు మొదలయ్యాయి. వేకువజామునే భోగిమంటలు వేసి ఆనందంగా పండగను ప్రారంభించారు. హైదరాబాద్ తదితర గ్రామాల్లో ఉదయమే భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున భోగి జరుపుకున్నారు. ఏపీ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి.

2



## హ్యాపీ సంక్రాంతి

సంక్రాంతి పండుగ సందర్భంగా మన పత్రిక కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

\- ఎడిటర్



2

# మహిళా ఐఏఎస్‌పై అసభ్య కథనాలు

## టీవీ ఛానల్ జర్నలిస్టుల అరెస్ట్

# చట్టప్రకారమే అరెస్ట్


## విచారణకు రమ్మంటే పారిపోతే ఎలా

- రాత్రికిరాత్రే ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకుని పరారీ
- అందుకే అరెస్ట్ చేశాం.. త్వరలో వివరాలు వెల్లడి
- మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్



ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అని సజ్జన్నార్ అన్నారు.

2



# ఇరాన్‌ను వీడండి

## తక్షణమే ఇండియాకు వచ్చేండి

- అక్కడి భారతీయ పౌరులకు రాయబార కార్యాలయం అప్రమత్తం
- అందుబాటులో ఉన్న రవాణా మార్గాలను ఎంచుకోండి
- నిరసనలు, ఉద్రిక్తత నేపథ్యంలో సూచన

**ఇరాన్‌లో మారణ హోమం..** 2500 మందికి పైగా మృతి


**న్యూఢిల్లీ, జనవరి 14:** ఇరాన్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, హింసాత్మక నిరసనలు, భద్రతా పరిస్థితుల దృష్ట్యా, భారత ప్రభుత్వం తన పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపార వేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన సలహాకు ఈ సలహా పొడిగింపు అని రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. మిగతా 2 లో



2

# 29 మంది మావోయిస్టులు లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట బుధవారం 29 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారంతా దర్భ, కేరళ పాల్ ఏరియా కమిటీలో చురుగ్గా వ్యవహరించిన వారు.




## మోడీ సంక్రాంతి, మాఘబిహు శుభాకాంక్షలు

ప్రధాని మోడీ ప్రజలకు మకరసంక్రాంతి, మాఘ బిహు, పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. భారతీయ సంస్కృతి -సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నువ్వులు, బెల్లం తీపితో నిండిన ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం,శ్రేయస్సు, విజయం నింపాలని కోరారు. సూర్యుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు.

4

# అదిగో మకరజ్యోతి

- దర్శించి లక్షలాది మంది భక్తుల తన్మయత్వం



2



3

# అర్ధరాత్రి అరెస్టులు అన్యాయం

## రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన

## అరెస్టులను ఖండించిన కేటీఆర్, హరీష్‌రావు

సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు.



2

# కుక్కలపై విషప్రయోగం

గ్రామంలో కుక్కల బెడద పెరిగితే వాటిని బంధించి ఇతర ప్రాంతాల్లో వదిలేయాల్సిన సర్పంచ్‌లు వాటిపై విషప్రయోగం చేయడంతో ఏకంగా 600లకు పైగా కుక్కలు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఈ విషయం బయటకు రావడంతో జంతుసంరక్షణ సంస్థలు ఆందోళనకు దిగాయి. దీంతో ఐదు గ్రామాల సర్పంచులపై కేసులు నమోదు చేశారు.

## ఏకంగా 600 కుక్కలు మృతి.. ఐదుగురు సర్పంచ్‌లపై కేసులు

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI





# మహిళా ఐఏఎస్‌పై అసభ్య కథనాలు

## టీవీ ఛానల్ జర్నలిస్టుల అరెస్ట్

**హైదరాబాద్, జనవరి 14:** తెలంగాణలో ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచేలా వార్తలు ప్రసారం చేసిన కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు దూకుడు పెంచారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తరఫున సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఓ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్‌తో పాటు ఇద్దరు రిపోర్టర్లను అరెస్ట్ చేశారు. కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా ఇన్‌పుట్ ఎడిటర్‌ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. అలాగే.. మహిళా ఐఏఎస్‌ను కించపరిచే విధంగా 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు ప్రసారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఛానల్స్ బాధ్యులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీసీఎస్ పోలీసుల సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పలువురిని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పోలీసుల దూకుడుతో పలువురు యూట్యూబ్ ఛానల్స్ నిర్వాహకులు అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. కాగా.. సీఎం ఫొటో మార్ఫింగ్, మహిళా ఐఏఎస్‌పై అసభ్యకర కథనాలపై తెలంగాణ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనార్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తోంది. దర్యాప్తు వేగంగా పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. మరోవైపు మహిళా అధికారిపై అసభ్యకర కథనాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తీవ్రంగా ఖండించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లు కూడా ఈ వ్యవహారంపై సీరియస్ అయ్యాయి. ఇలాంటి వార్తలు అధికారుల మనోభావాలను దెబ్బతీస్తాయని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# చట్టప్రకారమే విలేకర్ల అరెస్ట్

## మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్, జనవరి 14 :** ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు. అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్ట్ దుర్మార్గం

## పండగపూట కక్షసాధింపు చర్యలు తగవు.. హరీష్ రావు

**హైదరాబాద్,జనవరి14:** ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పాలన చేతగాని సర్కారు.. పండగ పూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు అని విమర్శించారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా అని మండిపడ్డారు. ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి అని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవంపై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి అని అన్నారు. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా- డిజిటల్ మీడియాపై సిట్లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? అని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టుర్లు పరిపూర్ణచారి, సుధీర్‌ను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు.



# తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి



- భోగిమంటలు వేసిన రాష్ట్రాల ప్రజలు
- భోగి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు
- ఏపీలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు
- భారీగా తరలివచ్చిన వీక్షకులు
- ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర నేతల రాకతో హడావిడి

**హైదరాబాద్, జనవరి 14:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా మొదలయ్యాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బరుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు తిలకించారు. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబలపట్నంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

## భోగిమంటలు వేసిన రాష్ట్రాల ప్రజలు


తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు మొదలయ్యాయి. హైదరాబాద్ తదితర గ్రామాల్లో ఉదయమే భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున భోగి జరుపుకున్నారు. ఏపీ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసుకుంటూ ఆటపాటలతో రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా గడిపారు . సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అని అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. అలాగే భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మల కొలువును కూడా జరుపుతారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా భోగి సంబరాల్లో పాలుపంచుకున్నారు. విజయవాడలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ భోగి పండుగ రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు తీసుకురావాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# కుక్కలపై విషప్రయోగం

## ఏకంగా 600 కుక్కలు మృతి..

## ఐదుగురు సర్పంచ్‌లపై కేసులు

**కామారెడ్డి, జనవరి 14:** మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలలో సర్పంచ్‌లు.. సుమారు 600 కుక్కలను చంపి పూడ్చేశారు. ఈ ఘటన సంచలనం రేపుతోంది. పాల్వంచ, ఫరీద్‌పేట, బండరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి పంచాయతీ పరిధిల్లో ఉండే వీధి కుక్కలకు విష ఇంజక్షన్లు, గుళికలు పెట్టి హతమార్చినట్టుగా జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో.. పాతిపెట్టిన శునకాల మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికితీసి.. వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల మృతిపై స్టే అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ మాట్లాడుతూ.. తమకు తెలిసిన సమాచారం మేరకు ఆయా గ్రామాలలో పర్యటించి సుమారు 5 ఊర్లలో 600 కుక్కలను విష ఇంజక్షన్లు, గుళికలతో చంపివేసి గ్రామ శివారులో పాతిపెట్టినట్లుగా ఆనవాళ్లు లభించినట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కుక్కలను గ్రామాల నుంచి తరిమేస్తామంటూ కొందరు సర్పంచ్‌లు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుకునేందుకు ఇలా మూగజీవులను చంపడం ఎంతవరకు సమంజసమని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఇంజక్షన్ ఇవ్వాలని సూచించారు. జంతువుల పట్ల ప్రేమగా ఉండాలి తప్ప.. వాటిని హతమార్చడం ఎంతవరకు సమంజసమని అనిమల్ లవర్స్ ప్రశ్నించారు. అనంతరం.. ఈ విషయమై స్థానిక మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సర్పంచ్‌లపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులైన సెక్రెటరీలు కలిసే శునకాలను చంపివేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మాచారెడ్డి ఎస్ఐ అనిల్ స్పందిస్తూ.. సదరు ఐదు గ్రామాల సర్పంచులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# శబరిగిరులపై మకరజ్యోతి దర్శనం

**తిరువనంతపురం, జనవరి14:** శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణల మధ్య మకర జ్యోతిని అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు భక్తి తన్మయత్వంతో దర్శించుకున్నారు. జనవరి 14వ తేదీ మకర సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. అయితే ఈ సారి మకరవిలక్కు ఉత్సవాలకు వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి. దాంతో బుధవారం ఉదయం 10గంటల తర్వాత పంబ నుంచి సన్నిధానానికి భక్తులను అనుమతించ లేదని సమాచారం. పంచగిరులు.. నీలిమల, కరిమల, శబరిమల, అప్పాచిమేడు, అలుదామేడు ప్రాంతాల్లో ఈ దివ్య జ్యోతి దర్శనం స్పష్టంగా కనిపించింది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ.. పంచగిరులపై మకరవిలక్కు (మకర జ్యోతి)గా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. దాంతో లక్షలాది మంది భక్తులు శబరిమలకు మకర సంక్రాంతి వేళ.. తరలివస్తారు. మరోవైపు ఈ రోజు అంటే.. బుధవారం మధ్యాహ్నం 3.13 గంటల నుంచి మకర సంక్రాంతి పుణ్యకాలం ప్రారంభమైంది. దీంతో స్వామివారికి మేల్ శాంతుల పేరిట తంత్రిలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇక జనవరి 12వ తేదీన పందళం రాజప్రసాదం నుంచి బయలుదేరిన స్వామివారి ఆభరణాలు ఈ రోజు సాయంత్రం 5.20 గంటలకు స్వామివారి సన్నిధికి చేరుకున్నాయి. వాటిని స్వామివారికి అలంకరించి.. మహదీపారాధన నిర్వహించారు. ఈ దీపారాధన అనంతరం పొన్నంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు దర్శనమిచ్చింది.

# గొంతుకోసిన చైనా మాంజా

## వాహనదారుడు మృతి

**సంగారెడ్డి, జనవరి 14:** సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవడంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బిహార్ కి చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం అతను బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వెళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్వైక్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చైనా మాంజా వల్ల మనుషులు, పక్షులు, జంతువులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఇప్పటికే నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. కాగా.. తెలంగాణలో చైనా మాంజా విక్రయం, వినియోగం, రవాణా పూర్తిగా నిషేధించిన విషయం తెలిసిందే.



హైదరాబాద్‌లో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో రూ.1.24కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దాదాపు 143 మందిని అరెస్టు చేశారు. వేలాదిగా బాబిన్లను పట్టుకున్నారు. అటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ పోలీసులు తనిఖీలు చేసి.. చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని.. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయించినా, వినియోగించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో 29 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఖమ్మం, జనవరి 14: మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లా గోగుండ ప్రాంతానికి చెందిన 29 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం (డీఏకేఎమ్ఎస్) నేత పొడియం బుధ్రాతో పాటు డీఏకేఎమ్ఎస్, జనత సర్కార్ వింగ్ వర్గాలతో పాటు ఇతర మావోయిస్టులు పోలీసులు ముందు లొంగిపోయారు. తమ ఆయుధాలను సరెండర్ చేశారు. పొడియం బుధ్రాపై రూ.2 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల పునరావాసం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా అనేక మంది మావోయిస్టులు ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని చెప్పారు. నక్సలిజంను వీడి సామాన్య జనజీవనాన్ని అవలంబించాలని ఈ సందర్భంగా ఇతర మావోలకు ఆయన పిలుపునిచ్చారు. కొంతకాలంగా మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతుండటంతో గోగుండ ప్రాంతంలో (దర్భా డివిజన్) ఉద్యమ ప్రాబల్యం మరింతగా తగ్గినట్లైంది. గోగుండలో సెక్యూరిటీ క్యాంపు ఏర్పాటుతో మావోయిస్టుల కార్యకలాపాలు చాలా వరకూ తగ్గిపోయాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మావోయిస్టు మద్దతుదారుల నెట్‌వర్క్ బలహీనపడిందని, ఫలితంగా సరెండర్లు పెరిగాయని చెబుతున్నారు. జనవరి 8న దంతేవాడలో 63 మంది సరెండర్ కాగా అంతకుముందు రోజున రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1500 మంది లొంగిపోయారు. ఈ ఏడాది మార్చ్ 31 నాటికి నక్సలిజంను రూపుమాపాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.



# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

- రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన
- అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 14:** సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

# కాంగ్రెస్ నేతల అవకతవకలపై సిట్ వేయండి



- జర్నలిస్టులపైనే సిట్ ఎందుకు
- అన్నింటిపైనా దమ్ముంటే విచారణ జరపండి
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్

**హైదరాబాద్, జనవరి 14:** జర్నలిస్టుల అరెస్టుపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెతుకు ఆనంద్ మండిపడ్డారు. జర్నలిస్టులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ వార్త చానల్‌లో వచ్చిన కథనం నేపథ్యంలో చానళ్లు, డిజిటల్ మీడియా హ్యాండిల్లపై దర్యాప్తు కోసం రేవంత్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంలో సీరియల్స్‌లో మాదిరి 8 మంది పోలీసులతో సిట్ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ఎప్పుడో రేవంత్ రెడ్డిపై పోస్టు పెట్టిన కావలి వెంకటేశ్‌పైనా సిట్ వేశారని మెతుకు ఆనంద్ తెలిపారు. కొడంగల్ మద్దూరుకు చెందిన వ్యక్తిని కూడా సిట్‌లో ఇరికించారని పేర్కొన్నారు. అసలు సిట్ అనే దానికి ఏమైనా విలువ ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలి.. స్టాండ్ అంటే నిలబడాలేమో అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ అనుచరులు మా వాళ్లను బెదిరించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అవాస్తవాలు ప్రచారం చేస్తే సిట్ వేశారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా అర్ధరాత్రి బుల్లెట్ మీద పోతున్నాడని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై సిట్ వేయరా అని ప్రశ్నించారు. ఆ రోజు ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డికి ఏడుపొక్కటే తక్కువైందని అన్నారు. ఇంత విషమిచ్చి చంపండని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మరి ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వారిపై సిట్ వేయరా అని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటి ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారని మెతుకు ఆనంద్ గుర్తుచేశారు. బిల్లులు చెల్లించేందుకు కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా కమిషన్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. దానిపై కదా సిట్ వేయాల్సింది అని అన్నారు. తుపాకీ పెట్టి బెదిరించి రూ.300 కోట్లు అడిగారని మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారు.. దానిపై కదా సిట్ వేయాల్సిందని అన్నారు. ములుగు జిల్లాలో మంత్రి ఇసుక దందా చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. దానిపై రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఎవరిని కదిలించినా కమిషన్లే అని విమర్శించారు. పోలీసుల దగ్గర మామూళ్లు, ట్రాన్స్‌ఫర్లకు కమిషన్లు అడుగుతున్నారని తెలిపారు. మోమిన్‌పేటలో రెండేళ్లలో ముగ్గురు సీఐలు మారారని తెలిపారు.

# ఉత్సాహంగా సాగిన కైట్ ఫెస్టివల్

## పరేడ్ గ్రౌండ్‌లో సందడిగా ఎగిరిన పతంగులు

## నోరూరించేలా స్వీట్ స్టాల్స్





**హైదరాబాద్,జనవరి14:** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 'అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ 2026' ప్రారంభమైంది. రంగురంగుల పతంగులతో భాగ్యనగర ఆకాశం ఒక అద్భుతమైన కాన్వాస్‌లా మారిపోయింది. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలో ప్రపంచం నలుమూలల నుంచి కైట్ ఫ్లయర్స్ తరలివచ్చారు. రష్యా, పోర్చుగల్, సింగపూర్, శ్రీలంక, థాయిలాండ్, ఉక్రెయిన్, వియత్నాం, జపాన్, ఇటలీ, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా వంటి 19 దేశాల నుండి 40 మంది నిపుణులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అలాగే భారత దేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ స్థాయి కైట్ ప్లేయర్స్ పాల్గొని వైవిధ్యమైన పతంగులను ఎగురవేస్తున్నారు. భూమి నుండి ఆకాశానికి రంగురంగుల సందేశాలు పంపుతున్నారా అన్నట్టుగా గ్రౌండ్ అంతా పతంగులతో నిండి పోయింది. డాల్ఫిన్లు, కార్టూన్ క్యారెక్టర్లు, డ్రాగన్లు, భారీ ఆకారాల్లో ఉన్న గాలిపటాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడి ప్రజల ఉత్సాహం, ఆతిథ్యం అద్భుతం అని అంతర్జాతీయ ఫ్లయర్స్ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ఏడాది మరికొన్ని పతంగులతో పాటు ప్రత్యేక ఆకర్షణలు కూడా తోడయ్యాయి. అక్కడ వివిధ రాష్ట్రాల సంప్రదాయ మిఠాయిల స్టాల్స్ ఆహార ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. జనవరి 16 నుంచి 18 వరకు పరేడ్ గ్రౌండ్‌లో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, అలాగే గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్ కూడా జరగనున్నాయి. ఇదిలావుంటే కైట్ ఫెస్టివల్‌కు తోడు స్వీట్ ఫెస్టివల్ కూడా అలరించింది. రకరకాల స్వీట్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

# వ్యక్తిత్వ హననం జరిగితే సహించం

## వ్యక్తులు, కుటుంబాలపై తప్పడు వార్తలు సరికాదు

## మహిళా ఐఎఎస్ కేసుపై డిజిపి శివధర్ రెడ్డి స్పందన



**హైదరాబాద్, జనవరి 14:** చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారి గౌరవానికి భంగం కలిగించేలా ఓ టీవీ ఛానల్, యూట్యూబ్ ఛానళ్లలో కథనాలు ప్రసారమైన నేపథ్యంలో డీజీపీ స్పందించారు. 'సోషల్ మీడియా అత్యుత్సాహంపై గతంలోనే హెచ్చరించాం. సోషల్ మీడియా పేరుతో వ్యక్తిత్వ హననం చేస్తే చర్యలు తప్పవు. వ్యక్తులు, కుటుంబాల గురించి తప్పుడు వార్తలు వేయవద్దు. వ్యక్తిగత అంశాలపై ఫేక్ న్యూస్ ప్రచారం చేయకూడదని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననంపై డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాన్ని వెల్లడించినట్లు గుర్తు చేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ ఒకటో తేదీన జరిగిన విలేకరుల సమావేశంలో.. సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశర చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు. సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, క్యారెక్టర్ అసాసినేషన్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ విధానంగా తెలియజేశానన్నారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్కులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరోమారు స్పష్టం చేశారు. చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిజిపి అన్నారు .అయితే ఆ పరిమితులను దాటి, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అబద్దాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# జర్నలిస్టుల అరెస్టు దారుణం

## విచారణ జరిగే లోపే అరెస్టులు ఎందుకు

## రేవంత్ రెడ్డిలో భయం నాటుకుందేమో

## మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి14(ఆర్ఎన్ఎ):** తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా? అని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టులు అక్రమం

## తీవ్రంగా ఖండించిన ఏపీయూడబ్ల్యూజే

**విజయవాడ,జనవరి14 :** ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టులను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వంపై విమర్శలు చేయడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మాత్రమే కారణంగా జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెర్చ్ వారెంట్ లేకుండా చానెల్ కార్యాలయంలోకి పోలీసులు ప్రవేశించి సోదాలు నిర్వహించడం పూర్తిగా అన్యాయమని అన్నారు. పండుగ సమయంలో అర్ధరాత్రి వేళ జర్నలిస్టుల ఇళ్లలోకి వెళ్లి తలుపులు పగలగొట్టి అరెస్టులు చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. నిర్దిష్ట విధి విధానాలను పాటించకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను అరెస్టు చేయడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు సుబ్బారావు.. ఇది పత్రికా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించారు. జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. టెలికాస్ట్ అయిన వార్తలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఫిర్యాదు చేయాల్సిందే తప్ప జర్నలిస్టులను అరెస్టు చేయడం సరికాదన్నారు.. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్ సుధీర్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని ఏపీయూడబ్ల్యూజే డిమాండ్ చేసింది.

# ఎన్టీవీ జర్నలిస్లు అరెస్టు తొందరపాటు చర్య

## కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి





**హైదరాబాద్,జనవరి14:** ఎన్టీవీలో వచ్చిన ఓ కథనంపై రేవంత్ సర్కార్ ఓవర్ రియాక్షన్ చేస్తోంది. జర్నలిస్టులపై రేవంత్ సర్కార్ ప్రతాపంపై పౌరసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తాజాగా ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టులను కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఖండించారు. అర్ధరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేయడం మంచిది కాదని హితవు పలికారు. నోటీసులు ఇచ్చి వ్యక్తిగతంగా వివరణ తీసుకుంటే బాగుండేదన్నారు. జర్నలిస్టుల అరెస్టులతో రాష్ట్రంలో యుద్ధ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. తెలంగాణ పోలీసుల చర్యలను ఖండిస్తున్నా.. తలుపులు బద్దలుగొట్టి దౌర్జన్యంగా బద్దలుగొట్టి ఇంట్లోకి వచ్చారు. పండగకు భార్యతో వెళ్తుండగా ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్‌ను లాక్కెళ్లడం సరికాదు. ప్రొసీజర్, నోటీసులు లేకుండానే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇది పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.

# జిల్లాలను మారిస్తే తీవ్ర పరిణామాలు

## మాజీ స్పీకర్ మధుసూధనాచారి హెచ్చరిక

**హనుమకొండ,జనవరి14:** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు ప్రతీకార పాలన కొనసాగిస్తుందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళు చెరిపేయడం రేవంత్ రెడ్డి జేజమ్మ తరం కూడా కాదన్నారు. కేసీఆర్ పాలనా సౌలభ్యం కోసం జిల్లాల విభజనను చేశారని, జిల్లాలను మార్చే దుర్మార్గానికి ఒడిగడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. చేతనైతే ఇచ్చిన హామీ ప్రకారం సాగు సాయాన్ని పెంచి అందించాలని, ఏదో ఒక సాకుతో జిల్లాలలో మార్పులు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో మార్పులు జరుగుతే తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల కోసం పోరాడే పార్టీ బీఆర్ ఎస్ పార్టీ అని గుర్తుచేశారు. గతానికి అదనంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యతగల ప్రభుత్వం దానికి భిన్నంగా జిల్లాలు కుదిస్తాం, మార్చేస్తాం అనే బాధ్యతారాహిత ప్రకటనలతో గందరగోళం సృష్టించి వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీయడం అత్యంత దుర్మార్గమన్నారు. సమావేశంలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్లు సోదా కిరణ్, నాయకులు ఇమ్మడి రాజు, శోభన్, సల్వాజీ రవీందర్ రావు, పానుగంటి శ్రీధర్, ఎండీ గౌస్‌ఖాన్, ఏలిషా, సౌరం రఘు, సంపతి రఘు, ఎస్కే మహిమూద్ పాల్గొన్నారు.

నేటి సాక్షి
కరీంనగర్ | గురువారం 15 జనవరి 2026




సంపాదకీయం

# సంక్రాంతితోనే ఉత్తరాయణం ప్రారంభం!

కాలగమనంలో మార్పును సూచించేదే సంక్రాంతి. చలికాం ముగిసిపోయి..వెచ్చని అడుగులు పడుతున్నాయన్న సంకేతం ఇచ్చేదే సంక్రాంతి. సూర్యుడు దక్షిణాయంనం నుంచి ఉత్తరాయణంలోకి పయనించేది కూడా సంక్రాంతి నుంచే. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఉత్తరాయణం పుణ్యకాలం మొదలవుతుంది. ఈ ఉత్తరాయణాన్ని దేవతలకు సంబంధించిన కాలంగా పరిగణిస్తారు. అందుకే ఈ కాలాన్ని ఆధ్యాత్మికంగా ఎంతో శుభప్రదంగా పరిగణిస్తారు. ఈరోజు నుంచి వివాహం, గృహప్రవేశం, నామకరణం, కొత్త వ్యాపారం వంటి ఇతర శుభ కార్యాలపై ఉన్న నిషేధం కూడా తొలగిపోతుంది. హిందువుల పండుగలు అన్నీ కానుగతిని బట్టి నిర్ణయించినవే. ఇందులో శాస్త్రీయతో పాటు, బలమైన సందేశం ఉంది. పండగల వైశిష్ట్యం అంతాఇంతా కాదు. ప్రతి పండగ వెనక పరమార్థం ఉంది. వాటిని ఆరించే విధంగా చేస్తున్నవే పండగలు. సంక్రాంతి పండగ తెలుగు వారికి పెద్ద పండగే అయినా...దేశంలోని పలు ప్రాంతాల్లో దీనిని పలు రకాలుగా జరుపు కుంటారు. తెలుగు పంచాంగం ప్రకారం మకర సంక్రాంతి పండుగని సూర్యుడు రాశి మార్పు ఉత్తరాయణం ప్రారంభానికి సూచికగా భావిస్తారు. ఇదే రోజున శ్రీమహావిష్ణువుకు అంకితం చేసిన షట్తిల ఏకాదశి అరుదైన కలయిక ఏర్పడుతోందని చెబుతున్నారు పండితులు. ఈ ప్రత్యేక యోగంలో చేసే పవిత్ర స్నానం, దానధర్మాలు, పూజలు మామూలు రోజులు చేసే పూజాఫలం కంటే అనేక రెట్లు ఎక్కువ పుణ్యాన్ని ఇస్తుందని నమ్ముతారు. షట్తిల ఏకాదశి ఉండటం వల్ల ఈరోజుకు మరింత విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో మకర సంక్రాంతి పండుగకి ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. హిందువులు ఈ సంక్రాంతి పండుగని పెద్ద పండుగగా జరుపుకుంటారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక శుద్ధి, నూతన శక్తికి సంబంధించిన పండుగగా పరిగణిస్తారు. ఈ పండుగ వేళ పవిత్ర స్నానాలు, దానధర్మాలు, పూజలు, సూర్యారాధన వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సూర్యభగవానుడు మకర రాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణం ప్రారంభిస్తాడు. అలాగే హిందూ సంప్రదాయం ప్రకారం మకర సంక్రాంతి రోజు చేసే దానధర్మాలు, పుణ్య కార్యాలు, పరిహారాలు ఏడాది పొడవునా సుఖశాంతులు, సిరిసంపదలు, శ్రేయస్సు కలిగిస్తాయని నమ్మకం. ఈ సంక్రాంతి పండుగ రోజు సాధారణంగా ఇరుగు పొరుగు వారికి పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు ఇస్తారు. సంక్రాంతి పండుగ, మకర సంక్రాంతి పండుగ అందమైన రంగవల్లులకు.. గొబ్బెమ్మలకు.. హరిదాసుల పాటలకు.. బసవన్నల ఆటలకు.. నువ్వుల మిఠాయిలకు.. గాలిపటాలు ఎగరేయడానికి ఇలా ఎన్నో సంబరాలకు ప్రసిద్ధి. ఈ సంక్రాంతి పండుగను పంటల పండుగ అని.. అలాగే మార్పు తీసుకొచ్చే పండుగ అని కూడా అంటారు. అలాగే ఈ పండుగలు అనేవి మన వర్తమాన, భవిష్యత్తులను గుర్తుచేస్తూ.. స్పృహతో మలచుకోవాలి అనే విషయాలను గుర్తుచేస్తాయి. అంతే కాకుండా ఈ సంక్రాంతి పండుగ రోజున సూర్య భగవానుడిని నియమ నిష్టలతో భక్తి శ్రద్ధలతో పూజించి నైవేద్యాలు సమర్పించడం వల్ల ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడి ఆశీస్సులు పుష్కలంగా ఉంటాయని పండితులు చెబుతారు. వేకువజామున లేచి తలంటుకుని స్నానం చేసి సూర్యభగవానుడికి నమస్కరించి అర్ఘ్యం వదలాల్సి ఉంటుంది. అంటే ఈ పండుగ రోజుల్లో స్నానం చేయకపోతే కనుక 7 జన్మల పాటు రోగాల బారిన పడి నిర్ధనుడై జీవిస్తాడని శాస్త్రంలో చెప్పారు. కాబట్టి పవిత్రమైన సూర్య సంక్రమణం సమయంలో స్నానం చేయడం ఎంతో శుభప్రదం. ఈ పండుగ మూడు రోజులు ఎంత పని ఉన్నా ఎలా ఉన్నా స్నానం మాత్రం తప్పకుండా చేసి శుచిగా ఉండాలి. ముఖ్యంగా ఈ మూడు రోజులు తెల్లవారు జామున నిద్రలేచి సూర్యోదయం వేళ స్నానం చేసి సూర్య నమస్కారం చేస్తే ఎంతో పుణ్యప్రదం. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో ఆచరించే పూజలు, నోములు,బొమ్మల కొలువు ఎంతో ఆనందంతో పాటు సర్వ శుభాలను కలగజేస్తాయని నమ్మకం కలుగుతుంది. పంచభూతాలలో పరమాత్మను దర్శించగలిగి, జ్ఞానమనే చీకటి నుంచి వెలుగు మార్గాన పయనమే సంక్రాంతి సూర్యదేవుడికి ఫలపుష్పాదులను సమర్పించి పూజిస్తారు. సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వచ్చినా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే కాలం పుణ్యపదమని నమ్మకం. ధనుర్మాసంలో వానలు తగ్గి భూమి పొడిగా ఉంటుంది. ఆవుపేడ కలిపిన నీటిని చల్లి ముగ్గులు పెడితే కంటికి ఇంపుగా ఉండడమే కాకుండా పురుగులు, విష కీటకాలు ఇంట్లోకి రావు. సున్నంతో పెట్టిన ముగ్గులు, గడపలు, గొబ్బెమ్మలకు పెట్టిన పసుపు కుంకుమలు ఇంటికి శోభనివ్వడమే కాకుండా పసుపు సూక్ష్మజీవు లను నశింపజేస్తుంది. హరిదాసులు, నందీశ్వరుడినే నాట్యమాడించే గంగిరెద్దుల వారు ఇచ్చినది తీసుకుని సంతృప్తిగా వెళ్లడం దానగుణాన్ని పెంపొందిస్తుంది. క్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, సన్నిహితుల కోసం సంప్రదాయ వంటలు తయారు చేస్తారు. సాధారణంగా సంక్రాంతి నైవేద్యాలలో కట్టుపొంగలి, చక్కెర పొంగలి ఉంటాయి. పొంగలిలో ఉపయోగించే పెసరపప్పు, మిరియాలు, జీలకర్ర, అల్లం శ్లేష్మాన్ని పోగొట్టి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. నెయ్యి శరీరానికి పుష్టిని, ఎముకలకు బలాన్ని ఇస్తుంది. తెల్లవారు జామునే లేవడం, స్నానం, భగవంతుని ప్రార్థించడం, పూజ, నైవేద్యాలు, ఆరోగ్య కారకం. పార్వతి దేవి శివుని భక్తగా పొందడానికి తపన్సు చేసి పూజించి.. పెసరపప్పు, బియ్యం, నెయ్యి కలిపి వండిన పొంగలిని వివేచన చేసినట్లు పురాణ కథనం.


# అమెరికాలో చేరేది లేదు

## గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్

**కోపెన్‌హాగెన్, జనవరి 14:** అమెరికాలో స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులపై గ్రీన్‌ల్యాండ్ స్పందించింది. తాము అమెరికాలో చేరబోమని, డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, తమ దేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు అమెరికా బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. అమెరికానా, డెన్మార్కా ఎంపిక చేసుకోమంటే.. తాము డెన్మార్క్‌నే ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు. వాస్తవానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్‌లో భాగమని జెన్స్ ఫ్రెడరిక్ పేర్కొన్నారు. కోపెన్‌హాగన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డానిష్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్‌సన్ కూడా ఈ సమావేశంలో పాల్గన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రూబియోలతో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు బుధవారం జరగనున్న ఉన్నత స్థాయి చర్చలకు ముందు ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గ్రీన్‌ల్యాండ్‌పై బెదిరింపులను తగ్గించడం, దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడం



ఈ చర్చల లక్ష్యమని పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపులు ,ఆర్థిక ఒత్తిడి లేదా సైన్యాన్ని ప్రయోగించడం ద్వారా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ యత్నిస్తున్న సంగతి తెలిసిందే. జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ వ్యాఖ్యలపై ట్రంప్ మరింత బెదిరింపులకు దిగారు. తరువాత వారికి పెద్ద సమస్యను సృష్టించగలదని హెచ్చరించారు. అది వాళ్ల సమస్యఅని అన్నారు. వారి సమస్యతో తాను విభేదిస్తున్నానని అన్నారు.




# మోడీ సంక్రాంతి, మాఘబిహు శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, జనవరి 14:** ప్రధాని మోడీ ప్రజలకు మకరసంక్రాంతి, మాఘ బిహు మరియు పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. భారతీయ సంస్కృతి -సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నువ్వులు, బెల్లం తీపితో నిండిన ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం,శ్రేయస్సు, విజయం నింపాలని కోరారు. సూర్యుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు నేడు మాఘ బిహు పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పొంగల్ పర్వదినం సందర్భంగా తమిళనాడు ప్రజలకు కూడా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పండగ రైతులు, వారి కుటుంబాల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ పండగ మనల్ని పోషించే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, తద్వారా మన సమాజాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలు ఆత్మవిశ్వాసం, ఆశావాదాన్ని కలిగివుండాలని పేర్కొన్నారు. ఈసంవత్సరం ప్రజలందరికీ శ్రేయస్సు, సానుకూలత మరియు మంచి ఆరోగ్యం కలిగి ఉండాలని తెలిపారు.

# మరోమారు రాజ్యసభకు నో

## దిగ్విజయ్‌కు పార్టీ పరోక్ష సూచన



**భోపాల్, జనవరి 14:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని చెప్పారు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోతున్నట్లు తెలుస్తున్నది. షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీన్ ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభను వదిలేది నా చేతుల్లో లేదని, కానీ తన రాజ్యసభ సీటును ఖాళీ చేస్తున్నానని దిగ్విజయ్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2014 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎంగా యాన రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 1993 నుంచి 2003 వరకు ఆయన సీఎంగా చేశారు. 2003లో ఓడి పోయిన తర్వాత రాజకీయాలకు దిగ్విజయ్ స్వస్తి పలికారు. పదేళ్ల తర్వాత ఆయన రాజ్యసభలోకి ఎంట్రీ ఇచ్చారు.

# ఆరోపణలు సులువే.. ఆధారాలెక్కడ!

## కెనడాపై భారత రాయబారి ఫైర్



**ఢిల్లీ, జనవరి 14:** ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కెనడా 40 ఏళ్లుగా విఫలమవుతూనే ఉందని అక్కడి భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ అన్నారు. అందువల్లే భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మారుతోందని విమర్శించారు. కెనడా మీడియా సంస్థ సీబీసీకి దినేశ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటన ప్రస్తావనకు రాగా.. ఈ కేసులో భారత్‌పై కెనడా ఆరోపణలను ఆయన మరోసారి తిప్పికొట్టారు. "కెనడా గడ్డ నుంచి జరుగుతోన్న ఉగ్ర కుట్రల గురించి మేం 40 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాం. ఉగ్రవాద కట్టడికి ఈ దేశ నేతలెవరైనా చర్యలు చేపట్టారా? ఈ కేసుల్లో (ఎయిరిండియాపై బాంబు దాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ) కనీసం ఒక్కరికైనా శిక్ష పడిందా? కెనడా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోంది. ఉగ్రవాదుల గురించి భారత్ లేవనెత్తినప్పుడు ఆధారాలు కావాలని డిమాండ్ చేస్తోంది. మరి మా దేశంపై కెనడా ఆరోపణలు చేసినప్పుడు కూడా (నిజ్జర్ హత్య కేసు విషయంలో) ఆధారాలు చూపించాలి కదా. ఆరోపణలు చేయడం సులువే. ఆ ఘటనలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని చెప్పేందుకు కచ్చితమైన సమాచారం ఉందని పదే పదే చెబుతోంది. మరి అందుకు తగిన ఆధారాలెక్కడ?" అని భారత రాయబారి ప్రశ్నించారు. నిజ్జర్ హత్య కేసు కు సంబంధించి కెనడాలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదైందని, ఇప్పటివరకు భారత ప్రభుత్వంపై ఎలాంటి అభియోగాలు లేవని దినేశ్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందంటూ గతంలో కెనడా చేసిన ఆరోపణలతో ఇరుదేశాల మధ్య దౌత్య విభేదాలు రాజుకున్న సంగతి తెలిసిందే.

# ఇరాన్‌ను తక్షణమే వీడండి

## భారతీయులకు విదేశాంగశాఖ హెచ్చరిక



**న్యూఢిల్లీ, జనవరి 14:** ఇరాన్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, హింసాత్మక నిరసనలు, భద్రతా పరిస్థితుల దృష్ట్యా, భారత ప్రభుత్వం తన పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన సలహాకు ఈ సలహా పొడిగింపు అని రాయబార కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.. ఇరాన్‌లో నిరంతరం మారుతున్న పరిస్థితుల దృష్ట్యా , వాణిజ్య విమానాలు సహా అందుబాటులో ఉన్న ఏదైనా రవాణా మార్గం ద్వారా భారతీయ పౌరులు ఇరాన్‌ను విడిచి వెళ్లాలని సూచించారు. ఇరాన్‌లో ఉన్న అన్ని భారతీయ పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి నిరసనలు లేదా రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలని మరియు పరిస్థితిపై తాజా పరిస్థితుల కోసం స్థానిక మీడియాను ఫాలో కావాలని భారత రాయబార కార్యాలయం తెలిపింది.. భారత పౌరులు తమ ప్రయాణ మరియు ఇమ్మిగ్రేషన్ పత్రాలన్నింటినీ పాస్‌పోర్ట్‌లు మరియు గుర్తింపు కార్డులు వంటివి ? ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని.. తక్షణమే అందుబాటులో ఉండాలని రాయబార కార్యాలయం కోరుతోంది. వారికి ఏదైనా సహాయం అవసరమైతే వెంటనే భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా వారు కోరారు. ఇటీవలి ఇరాన్‌లో విస్తృత నిరసనలు, హింస మరియు భద్రతా చర్యలు జరిగాయి, దీనివల్ల విదేశీ పౌరుల భద్రత గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య తీసుకుంటామని అమెరికా బెదిరిస్తూనే ఉన్న విషయం విదితమే..

### ఇరాన్‌లో మారణ హోమం

#### 2500 మందికి పైగా మృతి..

**ఢిల్లీ, జనవరి 14:** ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం, అవినీతికి వ్యతిరేకంగా శాంతియుతంగా ప్రారంభమైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. నిరసనల కారులకు, భద్రతా దళాలకు మధ్య జరుగుతున్న పోరు మారణ హోమానికి కారణమైంది. ఆందోళనకారులను అణిచివేసేందుకు భద్రతా దళాలను ప్రభుత్వం రంగంలోకి దింపడం పెను విధ్వంసానికి దారి తీసింది. గత మూడు వారాలుగా ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనల్లో ఇప్పటివరకు 2,571 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ ఆందోళనల్లో ఇప్పటివరకు 2,571 మంది మృతి చెందారని, వారిలో 2,403 మంది ఆందోళనకారులని, 147 మంది భద్రతా సిబ్బంది అని అమెరికా కేంద్రంగా పని చేసే మానవ హక్కుల ఉద్యమకారుల సంస్థ ప్రకటించింది. ఈ ఘర్షణలతో ఏమాత్రం సంబంధం లేని 12 మంది చిన్నారులు, 9 మంది సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయినట్టు సదరు సంస్థ వెల్లడించింది. అలాగే ఇప్పటివరకు 18 వేల మంది నిరసనకారులను ఇరాన్ భద్రతా దళాలు అరెస్ట్ చేశాయి. కాగా, ఇరాన్‌లో ఆందోళనలను మరింతగా రెచ్చగొట్టేలా డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఆందోళనలు చేస్తూనే ఉండాలని, ప్రభుత్వ సంస్థలను స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సాయం అందించేందుకు వస్తున్నామని హామీనిచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలతో అమెరికా సైనిక చర్యకు సిద్ధమైందనే సంకేతాలు అందినట్టేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ట్రంప్‌గానీ, వైట్‌హౌజ్ వర్గాలు గానీ దీనిపై ఇప్పటివరకు ఏ స్పష్టతా ఇవ్వలేదు.

# హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి



- కోరుట్లలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన
- 'అరైవ్-అలైవ్‌లో భాగంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ పై సూచనలు

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు "అరైవ్-అలైవ్‌కార్యక్రమం కింద కోరుట్ల బస్టాండ్ వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజలకు డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాముఖ్యతను వివరించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవా హనాలపై వెళున్న వారికి హెల్మెట్ అవసరాన్ని వివరించడంతో పాటు, హెల్మెట్ ధరించి బాధ్యతగా ప్రయాణిస్తున్న వారికి రోజా పూలు అందించి అభినందించారు. కార్లలో సీట్ బెల్ట్ ధరించి ప్రయాణిస్తున్న డ్రైవర్లు మరియు ప్రయాణికులను కూడా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ ఎం. చిరంజీవి మరియు సిబ్బంది పాల్గొని ప్రజలకు మార్గదర్శక సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ద్విచక్రవాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేటప్పుడు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అతివేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారి తీస్తుందని, నిర్ణీత వేగంతోనే ప్రయాణించాలని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం సరికాదని, అది ప్రాణాంతకమని స్పష్టం చేశారు. ప్రయాణం ప్రారంభించే ముందు కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుంటూ జాగ్రత్తగా, బాధ్యతతో నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలని పోలీసులు పిలుపునిచ్చారు.



## ఘనంగా ఎల్లమ్మ బోనాలు

**నేటి సాక్షి, రంగారెడ్డి :** మొయినాబాద్ మండలంలోని మేడిపల్లి సర్పంచ్ మల్కాపురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో ఎల్లమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. గ్రామంలో ప్రతి సంవత్సరం జరిగే బోనాలు ఈ సంవత్సరం కూడా నూతనంగా ఏర్పడిన సర్పంచి వార్డు మెంబర్ల ఆధ్వర్యంలో మేడిపల్లిలో ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనాలు నిర్వహించారు. ఈ పండుగలో గ్రామ ప్రజలు యువకులు మహిళలు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్లు రమేష్, నవీన్ కుమార్, మధు కర్, బాలరాజ్, శ్రీశైలం, మహేష్, రామ్, చంద్రయ్య, రాఘవేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వేరో సర్కిల్



**నేటి సాక్షి, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మండలంలోని బట్టుపల్లి గ్రామంలో సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు స్వేరో సర్కిల్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్వేరో అధ్యక్షులు డోంగ్రి సురేష్, ఉపాధ్యక్షులు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బట్టుపల్లి గ్రామ సర్పంచ్ రాజేందర్, బీఆర్‌ఎస్ పార్టీ కాగజ్‌నగర్ మండల అధ్యక్షులు పార్వతి అంజన్న, వార్డ్ మెంబర్ వెంకటేష్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. స్వేరో ఉద్యమం ద్వారా సామాజిక న్యాయం, విద్యా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. స్వేరో సర్కిల్ ద్వారా గ్రామ స్థాయిలో ప్రజా చైతన్యం పెంపొందించి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ జిల్లా ఏర్పాటుకు కృషి

- ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** జిల్లా ఏర్పాటుకు అన్ని అవకాశాలు ఉన్నాయని, తప్పకుండా మిర్యాలగూడను కొత్త జిల్లా ఏర్పాటు చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఏర్పాటు విషయమై ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, మిర్యాలగూడ ప్రజల ఆకాంక్షలు తెలుసునని, ప్రస్తుత జిల్లాల పునర్విభజనలో ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుక వెళ్తుననీ చెప్పారు. జిల్లా సాధన సమితి నేతలు జిల్లా ఏర్పాటు ఉద్యమాన్ని నాటి నుండి ఇప్పటి వరకు చేస్తున్నారని వారి కోరిక నెరవేరేలాని అందరూ కోరుకుంటున్నామని చెప్పారు. ఏ మాత్రం అవకాశం వున్న జిల్లా ఏర్పాటు ఉద్దేశ్యాన్ని వదిలివేసేది లేదని తెలిపారు. కమిటీ ముందు మన జిల్లా ఏర్పాటు వాదనను వినిపించాల్సిన అవసరం వుందని పేర్కొన్నారు. అదేవిధంగా మిర్యాలగూడను జిల్లా చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నేతలు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్ళపల్లి రవి, బిసి జేఏసీ కోకన్వీనర్ దాశరాజు జయరాజు, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, సీనియర్ జర్నలిస్టులు ఖాజా హామీదొద్దిన్, ఏండి అస్లాం, రంగా శ్రీనివాస్, బొంగారాల మట్టయ్య, యాదగిరి, బెజ్జం సాయి, సిద్దు నాయక్, నాగేష్, మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్‌లో ఘనంగా ముగ్గుల పోటీలు

**నేటి సాక్షి, రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్) :** సంక్రాంతి పండుగ సందర్భంగా పోచమ్మవాడ గోసంగి యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాయికల్‌లో మహిళలకు ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా వేల్పుల గంగరాజం, కడకుంట్ల అభయ రాజ్ చెంగలి మహేష్ వ్యవహరించి, బహుమతులకు ఎంపిక చేశారు. గెలుపొందిన వారికి 4 వ వార్డు మాజీ కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షులు సొరపాక గంగవ్వ, కలమడుగు బాలామణి, గోసంగి యువజన సంఘం సభ్యులు కలమడుగు నారాయణ, సోరుపాక రవీందర్, కేతం గంగరాజం, కలమడుగు భూమేష్, సొరపాక శివరామకృష్ణ, కలమడుగు రమేష్, సిర్ర ప్రణయ్ కుమార్ కలమడుగు రాజశేఖర్, మల్యాల రాజు, కలమడుగు రాజం, అల్లే బీమయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టులపై నిరసన


**నేటి సాక్షి, జగిత్యాల(ఇమ్మడి విజయ్ కుమార్):** ఎన్‌టీవీ ఇన్‌పుట్‌ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్లు చారి, సుధీర్ అక్రమ అరెస్టుకు నిరసనగా టీయూడబ్లయూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. జర్నలిస్టులపై ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, నిరసనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే, అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనేక జర్నలిస్టులు పాల్గొన్నారు.






## ఘనంగా డాక్టర్ చక్రధర్ సిద్ధాంతి బర్త్‌డే

**నేటి సాక్షి, తిరుపతి:** ప్రసిద్ధ జ్యోతిష్యుడు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ చక్రధర్ సిద్ధాంతి జన్మదిన వేడుకలు తిరుపతి, వెదురు కుప్పం మండలంలోని పలు పంచాయతీల్లో ఘనంగా జరుపుకున్నాయి. అక్షయ క్షేత్రం, ఇతర ప్రాంతాల్లో అనాథలు, మానసిక వికలాంగులు, పేదల కోసం వస్త్రాలు, స్వీట్‌లు, పండ్లు, అన్నదానం నిర్వహించారు. పుట్టా మహేంద్ర, సుబ్రహ్మణ్యం, మునివేలు ఆధ్వర్యంలో తిరుపతి రొయ్య ఆస్పత్రి ప్రాంగణంలో రోగులు, పేదలకు అన్నదానం చేయబడింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చక్రధర్ సిద్ధాంతి స్వయంగా పేదలకు అన్నదానం చేసి సేవా కార్యక్రమానికి ప్రేరణనిచ్చారు. అనంతరం రొయ్య హాస్పిటల్స్ సిబ్బంది, స్థానిక నాయకులు ఆయనను గజమాలతో, శేష వస్త్రాలతో సత్కరించి ఘనంగా వేడుకలను ముగించారు.



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI



## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



**నేటి సాక్షి, మిర్యాలగూడ:** నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవాలని గ్రామ సర్పంచ్ ఇంజం నర్సిరెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు హానికరమైన ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా గాలిపటాలను వాడకూడదని గ్రామస్తులను కోరారు. అంతేకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని, గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు ఫారం విడుదల



**నేటి సాక్షి, మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లు, ప్లాట్లు పంపిణీ కార్యక్రమం కోసం దరఖాస్తు ఫారమ్‌ను బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మరియు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కలిసి అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు, లబ్ధిదారులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థించారు.

## పేకాట స్థావరంపై దాడి

### 8,200 రూపాయల నగదు స్వాధీనం



**నేటి సాక్షి, ధర్మారం:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మర్ ఖాన్‌పేట గ్రామ శివారులో బుధవారం పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించారు. స్థానిక ఎస్సై ఎం. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం ఆకస్మికంగా పేకాట స్థావరంపై దాడి చేస్తూ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 8,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. దాడి సమయంలో అక్కడ ఉన్న మరో ఐదుగురు వ్యక్తులు పోలీసులను గమనించి పరారయ్యారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి, భద్రతలు కాపాడేందుకు పోలీసుల నిరంతర నిఘా కొనసాగుతోందని, ప్రజలు కూడా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించమని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సినీ నటుడు మంచు విష్ణును కలిసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



**నేటి సాక్షి, తిరుపతి:** సినీ నటుడు మంచు విష్ణు ను తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారు భోగి, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ విద్యా నికేతన్ విద్యా సంస్థల ఆవరణలోని మంచు విష్ణు నివాసంలో జరిగిన ఈ సమావేశంలో, మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి ఇద్దరూ ఆయనను ఆప్యాయంగా పలుకరించారు. మంచు విష్ణు వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నాడు. తర్వాత పరస్పరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అదేవిధంగా, గత 210 రోజులుగా అక్రమ నిర్బంధంలో ఉన్న చెవిరెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి మోహిత్ రెడ్డి మరియు హర్షిత్ రెడ్డి వివరంగా తెలుసుకున్నారు.

## ఘనంగా ఆర్మీ వెటరన్స్ డే

**నేటి సాక్షి, కాగజ్‌నగర్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె శివకుమార్ ఆధ్వర్యంలో ఆర్మీ వెటరన్స్ డే వేడుకల బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్, చాయ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళులు అర్పించడమే కాకుండా, పూర్వ సైనికుల సేవలను గుర్తించే రోజు ఆర్మీ వెటరన్స్ డే అని తెలిపారు. ప్రతియేటా జనవరి 14న ఈ వేడుకను జరుపుకుంటామని వివరించారు.

# అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు

- ముగ్గులు సాంప్రదాయాలకు ప్రతీక : బీజేపీ జిల్లా కార్యదర్శి నంద్యాడపు వెంకటేష్







**నేటి సాక్షి, రుద్రంగి (కోక్కుల వంశీ):** సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నంద్యాడపు వెంకటేష్ ఆధ్వర్యంలో, పార్టీలకు అతీతంగా, మహిళలకు ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానిక ఇందిరాచౌక్‌లో ఏర్పాటు చేసిన పోటీలకు విశేష స్పందన లభించింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సంప్రదాయ ముగ్గులను అలంకరించి, బహుమతులను గెలుచుకున్నారు. మొదటి బహుమతి రూ. 5,000, రెండవ బహుమతి రూ. 3,000, మూడవ బహుమతి రూ. 2,000 గా నిర్ణయించబడింది. అంతేకాకుండా పాల్గొన్న ప్రతి మహిళకు చిన్న పాటి బహుమతులు కూడా అందజేయబడ్డాయి. బహుమతుల దాతగా పేరు పొందిన శ్రీ మాహేశ్ నగదు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ౼× మోతిరామ్ పాల్గొని విజేతలకు బహుమతులు, లడ్డూలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిలో వార్డు మెంబర్లు ఉప్పులూటీ గణేష్, పడల గణేష్, బోయిని రాజు, మీసాల రవీందర్, పెద్ది శ్రవణ్, శీలం కుంటయ్య, బొబ్బిలి నితీష్, బొబ్బిలి టీంకు, లక్కకుల సాయి మరియు యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నంద్యాడపు వెంకటేష్ మాట్లాడుతూ, "సంక్రాంతి అంటేనే సంప్రదాయ ముగ్గులు గుర్తుకు వస్తాయి. మహిళల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి, చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించడానికి ఈ పోటీలు ఉత్సవాల వాతావరణాన్ని కల్పిస్తాయి" అన్నారు. శ్రీ మాహేశ్ మాట్లాడుతూ, "మహిళలను ప్రోత్సహిస్తూ, పండుగ వాతావరణాన్ని నెలకొల్పే ఉద్దేశంతో నగదు బహుమతులు అందజేయడం జరిగింది. యువతను ప్రోత్సహిస్తూ, క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేయడం జరుగుతోంది" అని తెలిపారు.

# సీపీఎం సీనియర్ నేత అవనిగడ్డ వీర వర్మ మృతి

- భౌతిక దేహం వైద్య పరిశోధనల కోసం మెడికల్ కళాశాలకు అప్పగింత
- అంతిమయాత్రకు సీపీఎం రాష్ట్ర నేతలు హాజరు



**నేటి సాక్షి, తిరుపతి:** సీపీఎం సీనియర్ నేత అవనిగడ్డ వీర వర్మ(84) బుధవారం ఉదయం స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు, అని సీపీఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ప్రకటించారు. చివరి శ్వాస వదిలేంతవరకు అవనిగడ్డ వీర వర్మ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని, సైద్ధాంతిక నిబద్ధతతో పార్టీకి తన సేవలందించిన నాయకుడని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వీరి భౌతిక దేహాన్ని గురువారం నాటి ఉదయం శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలకు అప్పగించి వైద్య పరిశోధనలు చేయించనున్నారు. అంతిమయాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. రాంభూపాల్, మూలం రమేష్, జిల్లా నాయకులు పాల్గొననున్నారు. వీరి మృతిపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్ నర్సింగరావు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, తెలంగాణ సీపీఎం రాష్ట్ర నేత పి. సోమయ్య, గుంటూరు జిల్లా సీపీఎం కార్యదర్శి కే. నేతాజీ, నగర కార్యదర్శి నళినీకాంత్ తదితరులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### అవనిగడ్డ వీర వర్మకు ఘన నివాళులు:

వీరి భౌతిక దేహాన్ని సీపీఎం కార్యాలయంలో ఉంచి పార్టీ కార్యకర్తలు, ప్రజలు సందర్శన చేశారు. మాజీ కేంద్రమంత్రి చింతామోహన్, సీనియర్ పాత్రికేయులు రాఘవ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సీపీఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వి. గంగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. హేమలత, సీపీఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, మాధవ్ కృష్ణ బుజ్జి, ఎం. నాగార్జున, జి. వెంకటేశం, గుణశేఖర్, బాలాజీ, చిన్నా, జయంతి, ఎన్డీ శీను, నరేంద్ర, అర్జున్ ఎలక్ట్రికల్స్ అధినేత పగడాల అర్జున్, ఎన్. ఆదిశేషారెడ్డి, కోడూరుచంద్ర, వెంకటేష్ మరియు వీరి కుమార్తెలు అవనిగడ్డ కళ్యాణి, అవనిగడ్డ వనజ, అవనిగడ్డ పద్మజ పుష్పాంజలులు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.

# ప్రజా సమస్యల గొంతుకకు ప్రతీకగా ప్రజాజ్యోతి

- కోరుట్లలో క్యాలెండర్ ఆవిష్కరణలో సీఐ సురేష్ బాబు



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో ప్రముఖ తెలుగు దినపత్రిక ప్రజా జ్యోతి 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను కోరుట్ల సీఐ సురేష్ బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కోరుట్ల సీఐ కార్యాలయంలో జరగగా, ప్రజా జ్యోతి పత్రిక ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న తీరును ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు. సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ, ప్రజా జ్యోతి పత్రిక సమాజంలో జరుగుతున్న సమస్యలను నిస్పాక్షికంగా వెలుగులోకి తీసుకువచ్చి, ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ఆ బాధ్యతను ప్రజాజ్యోతి సమర్థవంతంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రజా జ్యోతి 2026 క్యాలెండర్ ఆవిష్కరణతో పాటు పత్రిక భవిష్యత్తులో మరింత ప్రజాహిత కార్యక్రమాలతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రజాజ్యోతి రిపోర్టర్ సుజాయిత్ అలీ, ప్రజాజ్యోతి రూరల్ రిపోర్టర్ మోహన్, పాత్రికేయులు, లక్ష్మీరాజం, రాధారపు నర్సయ్య, బలిజ రాజారెడ్డి, అన్వర్ సిద్ధికి, సాజిద్ అలీ, ముక్రం బైగ్, సలాఉద్దీన్, రమణ, హుస్సేన్, శ్రీకాంత్, శంకర్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.




## టాప్‌లోకి దూసుకెళ్లిన విరాట్ కోహ్లీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్?లో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్? ప్లేస్?కు చేరుకున్నాడు. ప్రస్తుతం విరాట్ 785 రేటింగ్స్?తో నెం.1 ర్యాంక్?లో ఉన్నాడు. గత నాలుగేళ్లలో వన్డే ర్యాంకింగ్స్?లో నెం.1 పొజిషన్?కు చేరుకోవడం విరాట్?కు ఇదే తొలిసారి. అతడు చివరిసారిగా 2021 జులైలో వన్డేల్లో నెం1 ర్యాంక్? సాధించాడు. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ 784 రేటింగ్స్‌తో రెండు స్థానంలో ఉన్నాడు. టాప్?లో విరాట్‌కు, డారిల్ మిచెల్?కు ఒకే రేటింగ్ పాయింట్ తేడా ఉండడం గమనార్హం. ఇక స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ టాప్ నుంచి మూడో ప్లేస్‌కు పడిపోయాడు. గత కొన్నిరోజులుగా వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ టాప్‌లో ఉన్నాడు. అయితే రీసెంట్‌గా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో రోహిత్ స్వల్ప స్కోర్‌కే ఔటయ్యాడు. అదే సమయంలో విరాట్ గత ఐదు వన్డే మ్యాచ్‌ల్లో 50ం స్కోర్లు సాధించాడు. దీంతో కోహ్లీ ఒక స్థానం మెరుగుపర్చుకోగా, రోహిత్? రెండు స్థానాలు దిగజారాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 775 రేటింగ్స్?తో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. BCCI Pగతేడాది సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ అత్యుత్తం ప్రదర్శన చేశాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో విరాట్ రెండు సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ సహా 303 పరుగులు చేసి ఔరా అనిపించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. అంతకుముందు ఆస్ట్రేలియా సిరీస్‌లో మూడో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేశాడు. ఇక ప్రస్తుతం కివీస్‌తో జరుగుతున్న సిరీస్‌లోనూ తొలి మ్యాచ్‌లో విరాట్ 93 పరుగులతో రాణించాడు. తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. అలా విరాట్ ఆడిన ఆఖరి 5 వన్డేల్లో అన్నింట్లోనూ 50ం స్కోర్లు చేశాడు. బౌలింగ్ విభాగానికి వస్తే, టాప్ 5 స్థానాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టాప్?లోనే ఉన్నాడు. అతడు 710 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో ఉండగా, ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ (670 రేటింగ్స్) రెండో ప్లేస్?లో ఉన్నాడు. ఈ లిస్ట్‌లో టీమ్‌ఇండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడో స్థానంలో ఉన్నాడు. కాగా, రాజ్‌కోట్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో విరాట్ నిరాశ పర్చాడు. ఈ మ్యాచ్‌లో 29 బంతులు ఆడిన అతడు 23 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇందులో 2 ఫోర్లు ఉన్నాయి. మరో స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కూడా స్వల్ప స్కోర్‌కే పెవిలియన్ చేరాడు . అతడు 24 పరుగులు చేసి ఔటయ్యాడు.

## లీగ్ నుంచి తప్పుకున్న మొహమ్మద్ రిజ్వాన్

బిగ్ బాష్ లీగ్‌లో భాగంగా సిడ్నీ థండర్ వర్సెస్ మెల్బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ హై డ్రామా చోటుచేసుకుంది. మెల్బోర్న్ తరఫున ఆడుతున్న రిజ్వాన్, క్రీజులో సెట్ అయినప్పటికీ పరుగులు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడాల్సిన సమయంలో ఆయన సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. రిజ్వాన్ 23 బంతుల్లో కేవలం 26 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్సర్) మాత్రమే చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ కేవలం 113 దగ్గరే ఆగిపోవడంతో, స్కోరు బోర్డు వేగం మందగించింది. ఇన్నింగ్స్ 18 ఓవర్లు ముగిసే సమయానికి మెల్బోర్న్ జట్టు 154/5 స్కోరుతో ఉంది. ఇంకా కేవలం 12 బంతులు మాత్రమే మిగిలి ఉండటంతో, క్రీజులో పవర్ హిట్టర్లు ఉండాలని కెప్టెన్ విల్ సదర్లాండ్ భావించారు. డగౌట్ నుంచి సిగ్నల్ రావడంతో, రిజ్వాన్ ఎటువంటి గాయం లేకపోయినప్పటికీ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం దీనిని 'రిటైర్డ్ అవుట్'గా పరిగణిస్తారు. ఇలా బీబీఎల్ చరిత్రలో బలవంతంగా రిటైర్డ్ అవుట్ చేయబడిన మొదటి విదేశీ ఆటగాడిగా రిజ్వాన్ నిలిచాడు. రిజ్వాన్ స్థానంలో స్వయంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ క్రీజులోకి వచ్చాడు. అయితే ఈ 'మాస్టర్ ప్లాన్' ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సదర్లాండ్ ఎదుర్కొన్న మొదటి బంతికే రన్ అవుట్ అయి పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో రెనెగేడ్స్ జట్టు కేవలం 16 పరుగులు మాత్రమే జోడించగలిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 170 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో సిడ్నీ థండర్ డీఎల్ఎస్ పద్ధతిలో విజయం సాధించింది. ఈ సీజన్‌లో మొహమ్మద్ రిజ్వాన్ ప్రదర్శన నిరాశాజనకంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఆయన కేవలం 167 పరుగులు మాత్రమే చేశాడు. ఆయన ఓవరాల్ స్ట్రైక్ రేట్ 101 గా ఉండటం టీ20 ఫార్మాట్‌లో ఆందోళన కలిగించే అంశం. ఈ అవమానకర ఉదంతంతో పాకిస్థాన్ సెలెక్టర్లు రిజ్వాన్‌ను రాబోయే టీ20 వరల్డ్ కప్ జట్టులోకి తీసుకోవడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆధునిక టీ20 క్రికెట్‌లో స్ట్రైక్ రేట్ అనేది ప్రాణవాయువు వంటిది. ఎంతటి స్టార్ ప్లేయర్ అయినా వేగంగా ఆడకపోతే జట్టు నుంచి పక్కకు తప్పుకోవాల్సిందేనని రిజ్వాన్ ఉదంతం మరోసారి నిరూపించింది.

# రెండో వన్డేలో టీమిండియా ఓటమి

**కేఎల్ రాహుల్ సెంచరీ వృథ**

**రెండో వన్డేలో భారత్‌పై 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం**

**అద్భుత సెంచరీతో కివీస్‌ను గెలిపించిన డారిల్ మిచెల్ (131లి)**

**టీమిండియా తరఫున కేఎల్ రాహుల్ (112లి) శతకం వృథ**

**విఫలమైన రోహిత్, కోహ్లీ.. రాణించిన శుభ్‌మన్ గిల్ (56)**

**బౌలింగ్‌లో తేలిపోయిన భారత బౌలర్లు**






న్యూజిలాండ్ తో జరిగిన రెండో వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. డారిల్ మిచెల్ (117 బంతుల్లో 131 నాటౌట్) అద్భుత శతకంతో చెలరేగడంతో, టీమిండియా నిర్దేశించిన 285 పరుగుల లక్ష్యాన్ని కివీస్ సునాయాసంగా ఛేదించింది. కివీస్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. భారత జట్టులో కేఎల్ రాహుల్ (112 నాటౌట్) అజేయ సెంచరీ వృథ అయింది. రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, కేఎల్ రాహుల్ శతకం, శుభ్‌మన్ గిల్ (56) అర్ధశతకంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (24), విరాట్ కోహ్లీ (23), శ్రేయస్ అయ్యర్ (8) వంటి కీలక బ్యాటర్లు విఫలం కావడంతో భారీ స్కోరు సాధ్యం కాలేదు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 285 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్, 46 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన డారిల్ మిచెల్, విల్ యంగ్ (87)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 162 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ నుంచి లాగేసుకున్నారు. విల్ యంగ్ ఔటయ్యాక, గ్లెన్ ఫిలిప్స్ (32 నాటౌట్)తో కలిసి మిచెల్ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కివీస్ విజయంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమం అయింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 18న ఇండోర్ లో జరగనుంది.

## ప్రపంచకప్ స్క్వాడ్‌లో రోహిత్, కోహ్లీలకు చోటు




భారత క్రికెట్ అభిమానులకు ఒక తీపి కబురు. టీమ్ ఇండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై గత కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచ కప్‌లో ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు పాల్గొంటారా లేదా అన్న సందేహాలపై టీమ్ ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్‌కోట్‌లో న్యూజిలాండ్‌తో జరగనున్న రెండో వన్డేకు ముందు ఆయన మీడియాలో మాట్లాడుతూ, రోహిత్-కోహ్లీలు 2027 వరల్డ్ కప్ రోడ్‌మ్యాప్‌లో అంతర్భాగమని స్పష్టం చేశారు. "రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు కేవలం ఆటగాళ్లు మాత్రమే కాదు, వారు టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాల్లో కీలక భాగస్వాములు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో వారు నిరంతరం వన్డే ఫార్మాట్ గురించి, ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో జరిగే 2027 వరల్డ్ కప్ ప్రణాళికల గురించి చర్చిస్తున్నారు" అని కోటక్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. గంభీర్ ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్న వార్తల్లో నిజం లేదని, వారు అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్ అని, జట్టును ఎలా ముందుకు తీసుకెళ్లాలో వారికి బాగా తెలుసని ఆయన పేర్కొన్నారు. 2027 వన్డే వరల్డ్ కప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాల్లో జరగనుంది. దక్షిణాఫ్రికాలోని బౌన్సీ పిచ్‌లపై యువ ఆటగాళ్లు తడబడే అవకాశం ఉంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కోహ్లీ, రోహిత్ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉంటేనే భారత్ విజయావకాశాలు మెరుగుపడతాయని మాజీ క్రికెటర్లు సైతం అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వారు ఆడుతున్న తీరు, చూపిస్తున్న ఫిట్‌నెస్ ప్రకారం 2027 వరకు వారు ఆడటం ఏమాత్రం కష్టం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం భీకరమైన ఫామ్‌లో ఉన్నాడు. గత ఐదు వన్డేల్లో వరుసగా 50 కంటే ఎక్కువ పరుగులు చేసి ప్రపంచ నంబర్ 1 ర్యాంకింగ్ సొంతం చేసుకున్నాడు. అటు రోహిత్ శర్మ కూడా వన్డేల్లో తన దూకుడును కొనసాగిస్తున్నాడు. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత, వారిద్దరి పూర్తి ఫోకస్ ఇప్పుడు కేవలం వన్డే ఫార్మాట్‌పైనే ఉంది. ఇది జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్ అని కోచ్ అభిప్రాయపడ్డారు.

## ఆయుష్ బదోని ఎంపిక సరికాదు

**మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్**



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయంతో దూరమవ్వగా.. అతని స్థానంలో ఢిల్లీ ప్లేయర్ ఆయుష్ బదోనిని సెలెక్టర్లు ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపికను మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తప్పుబట్టాడు. ఇది సరైన ఎంపిక కాదని విమర్శించాడు. దేశవాళీ క్రికెట్‌లో అతని ప్రదర్శన మెరుగ్గా లేకున్నా..ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించాడు.'ఒకరి విషయంలో పరుగులు చేస్తేనే జట్టులో చోటు అంటున్నారు. మరొకరి విషయంలో మాత్రం పరుగులు చేయకున్నా జట్టులోకి తీసుకుంటున్నారు. ఐపీఎల్‌లో బదోని ఆడిన అద్భుత ఇన్నింగ్స్ ఏదైనా ఉంటే చెప్పండి. ఐపీఎల్ ప్రదర్శనను వన్డేలకు ప్రామాణికంగా తీసుకోకూడదు. అతను కేవలం మూడు వికెట్లు తీసుకున్నంత మాత్రాన ఆల్‌రౌండర్ అవుతాడా? అతను ఐపీఎల్‌లో ఎన్నిసార్లు బౌలింగ్ చేశాడు. అతను బౌలింగ్ చేయడం ఎవరైనా చూశారా?'అని క్రిష్ శ్రీకాంత్ సెలెక్టర్లను ప్రశ్నించాడు. రుతురాజ్ గైక్వాడ్ ఏం పాపం చేశాడని కూడా శ్రీకాంత్ నిలదీసాడు. 'గత వన్డే సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ సెంచరీ చేశాడు. కానీ అతన్ని ఎంపిక చేయలేదు. అతను ఏం తప్పు చేశాడు? ఒక వేళ ఆల్‌రౌండర్ అవసరమైతే అక్షర్ పటేల్‌ను తీసుకోవాల్సింది.'అని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో ఆయుష్ బదోని కనీసం 1000 పరుగులు కూడా చేయలేదని, అతని ఖాతాలో వికెట్లు కూడా ఎక్కువగా లేవని ఆకాశ్ చోప్రా విమర్శించాడు. నితీష్ కుమార్ రెడ్డిని జట్టులోకి తీసుకోని అవకాశాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించాడు. అతన్ని చివర్లో బ్యాటింగ్‌కు పంపించడం, కొన్ని ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయించడం సరికాదన్నాడు. అయితే ఈ విమర్శలకు టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సమాధానమిచ్చాడు. భారత్-ఏ తరఫున మెరుగైన ప్రదర్శన చేయడంతోనే బదోనిని తీసుకున్నామని స్పష్టం చేశాడు. ఐపీఎల్‌లోనూ అతను మెరుగ్గా రాణించాడని గుర్తు చేశాడు. బదోని జట్టులోకి వచ్చిన న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో అతనికి అవకాశం దక్కలేదు. సుందర్ స్థానంలో నితీష్ రెడ్డిని ఆడించారు.

## సరికొత్త రికార్డ్ సృష్టించిన హర్మన్‌ప్రీత్

మహిళల ప్రీమియర్ లీగ్?లో ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హర్మన్?ప్రీత్ కౌర్ సరికొత్త రికార్డ్ సృష్టించింది. తాజాగా గుజరాత్ జెయింట్స్?తో జరిగిన మ్యాచ్?లో 193 పరుగుల భారీ ఛేదనలో అదిరే ఇన్నింగ్స్?తో హర్మన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?' అవార్డు దక్కించుకుంది. 43 బంతుల్లోనే 71 పరుగులు చేసి జట్టును గెలిపించింది. ఈ క్రమంలోనే డబ్ల్యూపీఎల్?లో హర్మన్ అరుదైన రికార్డు తన పేరిట లిఖించుకుంది. ఆ రికార్డు ఏంటంటే? హర్మన్?ప్రీత్ ఈ ఎడిషన్?లో సూపర్ ఫామ్?లో దూసుకుపోతోంది. దీంతో మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో ఇప్పటికే అత్యధిక పరుగులు బాదిన భారత క్రికెటర్?గా నిలిచిన హర్మన్, తాజాగా మరో ఘనత సాధించింది. గుజరాత్?తో మ్యాచ్?లో సూపర్ ఇన్నింగ్స్?తో ఆమె డబ్ల్యూపీఎల్?లో 1000 పరుగులు మైలురాయి అందుకుంది. 55 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద హర్మన్ ఈ మైలురాయి అందుకుంది. దీంతో ఈ టోర్నీ హిస్టరీలో ఈ ఘనత సాధించిన భారత తొలి క్రికెటర్?గా హర్మన్ రికార్డులకెక్కింది. ఇక తాజా మ్యాచ్?లో హర్మన్ 71 పరుగులతో రాణించింది. ఈ క్రమంలోనే ఆమె మెగ్ లానింగ్, ఎల్లిస్ పెర్రీలను అధిగమించింది. ఓవరాల్?గా డబ్ల్యూరీపీఎల్?లో అత్యధిక పరుగులు బాదిన రెండో క్రికెటర్?గా హర్మన్ కొనసాగుతోంది. ఆమె ఇప్పటిదాకా 30 మ్యాచ్?ల్లో 46.18 సగటుతో 1016 పరుగులు చేసింది. ఇందులో 10 హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. 95 పరుగులు అత్యధిక స్కోర్?గా ఉంది. ముంబయి జట్టుకే చెందిన నాట్? సీవర్?బ్రంట్ 1101 పరుగులతో ఈ లిస్ట్?లో టాప్?లో ఉంది. కాగా, ఈ సీజన్?లో అత్యధిక పరుగుల నమోదు చేసిన బ్యాటర్?గానూ హర్మన్ టాప్?లో కొనసాగుతోంది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్?ల్లో ఆమె 165.00 యావరేజ్?తో 165 పరుగులు చేసింది. ఆర్సీబీతో ఆడిన తొలి మ్యాచ్?లో 20 పరుగులకే వెనుదిరిగిన ఆమె, తర్వాత వరుసగా 74 పరుగులు (దిల్లీ క్యాపిటల్స్), 71 పరుగులు (గుజరాత్?) రెండు భారీ హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. ఈ లిస్ట్?లో తర్వాత స్థానాల్లో సోఫీ డివైన్ (141), అష్లీ గార్డ్?నర్ (134) ఉన్నారు. ఇప్పటిదాకా ప్రస్తుత ఎడిషన్?లో ఆరు మ్యాచ్?లు ముగిశాయి. ఇక మ్యాచ్?విషయానికొస్తే, గుజరాత్?పై ముంబయి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 193 భారీ ఛేదనలో హర్మన్?తోపాటు అమన్?జోత్ కౌర్ (40 పరుగులు, 26 బంతుల్లో), నికోల కెరీ (38 పరుగులు, 23 బంతుల్లో) రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 192-5 భారీ స్కోర్ చేసింది. బెత్ మూనీ (33), కనికా అహుజా (35), జార్జ్ వేర్?హామ్ (43), భార్తి ఫుల్మాలి (36) ఆకట్టుకున్నారు.



# నేనెందుకు క్షమాపణలు చెప్పాలి:మైలకా అరోరా

ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హుయీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు. గతేడాది కూడా హనీ సింగ్‌తో కలిసి 'చిల్‌గమ్', ఆదిత్య సర్పోదర్ దర్శకత్వంలో వచ్చిన 'థామా'లో రష్మికతో కలిసి పాయిజన్ బేబీతో ఆకట్టుకున్నారు.



# మన శంకరవరప్రసాద్ కలెక్షన్ల దూకుడు

## రెండ్రోజులకే వందకోట్ల క్లబ్‌లో చేరిక

## కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్న దర్శకుడు

ఈ పండగకు అగ్ర హీరో చిరంజీవి శంకరవరప్రసాద్‌గా సందడి చేస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న ప్రేక్షకుల ముందుకువచ్చి ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తోంది. మొదటిరోజు రూ.84 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా రెండో రోజూ కూడా బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగించింది. తాజాగా దీని రెండు రోజుల కలెక్షన్లను నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా 48 గంటల్లో రూ.120 కోట్లు వసూలు చేసినట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమా వంద కోట్లు దాటడంపై అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తంచేశారు. వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తన ఆరో చిత్రమిదని పేర్కొన్నారు. అసలు సంక్రాంతి ఇప్పటినుంచి మొదలవుతుందని అందరూ ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఆనందించాలని కోరారు. తనకు ఇంతకుమించిన సంక్రాంతి గిఫ్ట్ మరొకటి ఉండదన్నారు. ఇక ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మై షోలో గంటకు 24 వేల టికెట్స్ అమ్ముడవుతున్నాయని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ పండగకు బ్లాక్‌బస్టర్ హిట్ సొంతం చేసుకున్న చిత్రమిదని ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' విజయం సాధించడంతో చిత్రబృందం తాజాగా సక్సెస్ మీట్ నిర్వహించింది. 25 రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేసినట్లు అనిల్‌రావిపూడి తెలిపారు. ఛాలెంజ్‌గా తీసుకుని సినిమాను పూర్తి చేసినట్లు చెప్పారు. ఇక తన అంచనా ప్రకారం ఈ చిత్రానికి రూ.400 నుంచి 500 కోట్లు వస్తాయని నిర్మాత సాహు గారపాటి తెలిపారు. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకుంది. దీంతో చిత్రబృందం తాజాగా సెలబ్రేషన్స్ చేసుకుంది. దర్శకనిర్మాతలతో పాటు చిరంజీవి, వెంకటేశ్, రామ్ చరణ్ ఆ సెలబ్రేషన్స్‌లో పాల్గొని కేక్ కట్ సందడి చేశారు.



# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ భేటీ

## తదుపరి ప్రాజెక్ట్ కోసమే అన్న ఊహాగానాలు

సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్స్ట్ లైన్-అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.






# తుంబాడ్ దర్శకుడి మరో మూవీ మయసభ

తుంబాడ్' వంటి కల్ట్ క్లాసిక్‌ను అందించిన దర్శకుడు రాహి అనిల్ బార్వే నుంచి మరో సంచలనం రాబోతోంది. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'మయసభ'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్. 'తుంబాడ్' తరహాలోనే ఈ సినిమాలో కూడా ఒక విభిన్నమైన ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందులో ప్రధాన పాత్రలో నటిస్తున్న జావేద్ జాఫ్రీ గతంలో ఎన్నడూ చూడని విధంగా ఒక కొత్త అవతారంలో కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. వీణా జమ్కర్, దీపక్ దామ్లే, మొహమ్మద్ సమద్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# హాస్యం చుట్టూ తిరిగిన అనగనగా ఒకరాజు

## సంక్రాంతికి నవ్వులు పండించిన నవీన్ పోలిశెట్టి

నేటి యువ కథానాయకుల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి అలాంటి వినోదాన్ని పంచడానికి 'అనగనగా ఒకరాజుఅంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడే రాజు (నవీన్ పొలిశెట్టి). వారసత్వంగా జమీందార్ మనవడు అనే పేరు తప్ప, తాత సంపాదించిన ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి చౌదరి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కెయొచ్చని భావించి, ఆమె మనసుని గెలుచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి చారులత మనసుని ఎలా గెలిచాడు?ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక పల్లెటూరి కథ ఇది. కథ, కథనం, పాత్రలు... ఇలా ప్రతిదీ ఇదివరకటి సినిమాల్లో చూసిన అనుభూతినే కలిగిస్తాయి. అయినా సరే, రాజు పాత్ర చేసే హంగామా నవ్విస్తుంది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి తన మార్క్ టైమింగ్‌ని ప్రదర్శిస్తూ, వన్ మేన్ షోలా సినిమాని ముందుకు నడిపించాడు. సంభాషణలు ఈ సినిమాకి ప్రధానబలం. తన దగ్గరికి సాయం కోసం వచ్చే జనాల కష్టాల్ని వింటూ రాజు పడే అగచాట్లతో సినిమా ముందుకు సాగుతుంది. ఆ సన్నివేశాలన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. పెళ్లిలో శపథం, డబ్బున్న అమ్మాయిల కోసం రాజు చేసే ప్రయత్నాలు, ఆపరేషన్ చారులత ఎపిసోడ్స్ మొదలయ్యాకే అసలు సినిమా మొదలవుతుంది. భీమవరం బాల్మ, రాజుగారి పెళ్లిరో పాటలు సినిమాకి మరింత ఊపుని తీసుకొస్తాయి. ఆ రెండు పాటల చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. చారులత మనసుని గెలిచేందుకు రాజు తన గ్యాంగ్‌తో కలిసి చేసే విన్యాసాలు బాగా నవ్విస్తాయి. విరామ సన్నివేశాలకు ముందు కథలో మలుపు ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధంలో కథ పూర్తిగా ఓ కొత్త మలుపుని తీసుకుంటూ, గ్రామ రాజకీయాల నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రథమార్ధంలో రాజు డబ్బు కోసం పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించినట్టే, ద్వితీయార్ధం కథలోనూ రాజు ఓ ఎత్తుగడ వేస్తాడు. అదే ఈ సినిమాకి కీలకం. ఎన్నికల ప్రచారం, ఊరి జనాన్ని నమ్మించేందుకు కథానాయకుడు పడే అగచాట్ల నేపథ్యం బాగా నవ్విస్తుంది. హీరో స్నేహితులు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, అది చూసి ఊరి జనాల ప్రతిస్పందన ఇలా సందర్భోచితంగా మంచి హాస్యం పండుతుంది. సోషల్ మీడియా క్యాంపెయిన్, ఎన్నికల హంగామా సాధారణంగానే అనిపించినా, పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. భార్యాభర్తల మధ్య సంభాషణలు ఒకింత సెంటిమెంట్‌ని పండిస్తాయి. కథ, కథనాల విషయంలో అంచనాలేమీ పెట్టుకోకుండా, సరదాగా కాలక్షేపాన్ని ఆశించి వెళ్లిన ప్రేక్షకులకు తప్పకుండా సంతృప్తినిస్తుందీ చిత్రం. నవీన్ పొలిశెట్టి వన్ మేన్ షోలా ఉంటుంది ఈ సినిమా. ప్రతీ సన్నివేశంలోనూ తెరపై కనిపిస్తూ, నాన్ స్టాప్‌గా సంభాషణలు చెబుతూ అల్లరి చేస్తుంటాడు. చారులత పాత్రలో మీనాక్షి చౌదరి ఆకట్టుకుంటుంది. ఆమెకి ఇందులో ప్రాధాన్యమున్న పాత్రే దక్కింది. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఎక్కువ సన్నివేశాల్లో కనిపించింది. హీరో గ్యాంగ్‌లో కనిపించే చమ్మక్ చంద్ర, మహేశ్, బుల్లిరాజుగా సుపరిచితమైన మాస్టర్ రేవంత్ అక్కడక్కడా నవ్వించారు. రావు రమేశ్ పాత్ర ఆకట్టుకుంటుంది. ప్రథమార్ధంలో ఓ కొత్త చిట్టి కనిపించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. మిక్కీ జె.మేయర్ పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాపై గట్టి ప్రభావమే చూపించారు. కథ, కథనాల కంటే సంభాషణల రచనే ఈ సినిమాకి ప్రధానబలం. బలమైన కథ లేదనే విషయం బయట పడకుండా, హాస్యం పండించేందుకు రచయితలు ప్రయత్నించారు.




Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

# రోడ్డు భద్రత, నేరాల నియంత్రణపై అవగాహన





**నేటి సాక్షి, పాములపాడు:** ఎస్పీ సునీల్ షేరాన్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఆధ్వర్యంలో పాములపాడు మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించి ప్రజలకు రోడ్డు భద్రత, నేరాల నియంత్రణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్సై పీ తిరుపాలు పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలనీ, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, ఓవర్‌లోడ్ ఆటోల్లో ప్రయాణం చేయరాదని స్పష్టం చేశారు. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని, వాహనం నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ లోన్లు, యాప్‌ల ద్వారా మోసాలు జరుగుతున్నాయని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగం ఇప్పిస్తామనే మాటలను నమ్మవద్దని, స్వయంకృషితో ముందుకు సాగాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, బాల్య వివాహాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో విలువైన ఆభరణాలు, వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా ప్రయాణం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు పంట పొలాల్లో మందులు పిచికారీ చేసే సమయంలో తప్పనిసరిగా మాస్క్ లేదా నోటికి గుడ్డ కట్టుకోవాలని, లేదంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల కుటుంబ కలహాలు, అప్పుల కారణంగా ఆత్మహత్యలు జరుగుతున్నాయని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడరాదని అన్నారు. బలవంతంగా ఆత్మహత్యలకు ప్రేరేపించడం మహాపాపమని, సమస్యలుంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. పిల్లల్లో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిందని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. సెలవుల సమయంలో పిల్లలు కాలువలు, వాగులు, బావుల వద్దకు ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మేకలచిన్నేపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- **రూ.5 లక్షలతో పాఠశాలకు ప్రార్థన మందిరం నిర్మాణం**



**నేటి సాక్షి, చౌడేపల్లి:** చౌడేపల్లి మండలం శెట్టిపేట పంచాయతీ పరిధిలోని మేకలచిన్నేపల్లిలో ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వంగా కలుసుకున్నారు. 2004-05 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులతో పాటు 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 20ఏళ్ల అనంతరం మళ్లీ కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మధురానుభూతులను పంచుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పరచుకున్న వారు అందరూ ఒకేచోట కలుసుకొని ఆప్యాయంగా ముచ్చటించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ.5 లక్షల వ్యయంతో ప్రార్థన మందిరం (షెడ్డు) నిర్మాణాన్ని చేపట్టి, దాన్ని పాఠశాలకు అంకితం చేశారు. పిల్లల చదువులు, భవిష్యత్తు గురించి అడిగి తెలుసుకుంటూ విద్యార్థులను ప్రోత్సహించారు. ముఖ్యంగా మహిళా పూర్వ విద్యార్థులు కలుసుకొని ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయగా, పాఠశాల ఉపాధ్యాయులను సాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో పాఠశాలకు అవసరమయ్యే వసతులను కూడా సమకూర్చుతామని పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో 2004-05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వృద్ధులకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం నాడు పసుపుల గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ వృద్ధులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా పసుపుల గ్రామంలో వ్యవసాయం చేస్తున్న రైతులకు ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత కరెంటు ప్రోసిడింగ్లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కే దక్కిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుపేదలకు సంక్షేమ పథకాలను దశలవారీగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పసుపుల గ్రామ ఉపసర్పంచ్ బి మహేష్, గ్రామ వార్డు సభ్యులు డి నరసింహులు, జయమ్మ గోవిందమ్మ, గ్రామ రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# గోలేటి సింగరేణి గ్రౌండ్‌లో కబడ్డీ ఫైనల్స్

## పులిమడుగు జట్టుకు ఘన విజయంలిలి

**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్:** కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అజ్మీర ఆత్మారాం నాయక్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని అజ్మీర ఆత్మారాం నాయక్ యువసైన్యం ఆధ్వర్యంలో గోలేటి సింగరేణి గ్రౌండ్‌లో గత కొన్ని రోజులుగా నిర్వహించిన కబడ్డీ పోటీలు శుక్రవారం ఫైనల్ మ్యాచ్‌తో ముగిశాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పలువురు జట్లు పాల్గొన్న ఈ పోటీలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హెూరాహెూరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో పులిమడుగు జట్టు విజేతగా నిలవగా, భీమారం జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు అజ్మీర ఆత్మారాం నాయక్, గోలేటి కైరిగూడ సర్పంచ్ అజ్మీర సంధ్యారాణి, ఉపసర్పంచ్ సునీత శంకర్ పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. విజేత జట్టుకు రూ. 21,000, రన్నరప్ జట్టుకు రూ. 11,000 నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అజ్మీర సాయి, అజ్మీర సందీప్, ప్రదీప్, సిహెచ్ సంతోష్, జరుపుల శివాజీ, అంబాదాస్, తరుణ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

# మరికల్‌లో కబడ్డీ టోర్నమెంట్ షురూ



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో యువకమండలి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం మరికల్ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ఆవరణలో క్రికెట్ టోర్నమెంట్, అదేవిధంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నారాయణపేట జిల్లా నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి, యువకులు క్రీడల్లో ఉన్నత స్థాయి స్థానంలో రాణించాలని ఆయన కోరారు. క్రీడల్లో గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య,మరికల్ యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మరికల్ గ్రామ అఖిలపక్ష నాయకులు మాజీ సర్పంచ్ కె, గోవర్ధన్, మరికల్ గ్రామం మాజీ ఎంపిటిసి సీమ గోపాల్, ఎల్ రాములు, నాగరాజు, మరికల్ ఎస్సై రాములు, రామకృష్ణారెడ్డి, టైసన్ రాఘవేంద్ర, రామకృష్ణ, పెంట మీద రఘు, రామన్ గౌడు, మల్లయ్య,మరికల్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గంగాపూర్‌లో క్రికెట్ పోటీలు





**నేటి సాక్షి, బుగ్గారం:** బుగ్గారం మండలం గంగాపూర్‌లో బుధవారం క్రికెట్ పోటీలను బుధవారం సర్పంచ్ రాయిల్ల శ్రీనివాస్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 5,016, రెండో బహుమతిగా రూ. 3,016, మూడో బహుమతిగా రూ. 2,016 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామ యువత, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుర్రపు తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు




- **సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డా. టేకూరి నాగేశ్వరావు**

**నేటి సాక్షి, పాములపాడు:** భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు సుఖసంతోషాలతో జరగాలని, ప్రజలందరికీ ఐక్యత, ఆనందం, ఆయురారోగ్యం కలగాలని పాములపాడు మండలం వేంపెంట గ్రామానికి చెందిన సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు, అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్‌టేకూరి నాగేశ్వరావు ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, నాయకులు, దేశ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ టేకూరి నాగేశ్వరావు మాట్లాడుతూ, భోగి పండుగ పిల్లలపై రేగిపండ్లు పోసి ఆశీర్వదించే సంప్రదాయంతో భోగభాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తుందని అన్నారు. సంక్రాంతి పండుగను గంగిరెద్దుల కోలాహలం, రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలు, పాల పొంగళ్లు, హరిదాసుల కీర్తనలతో ఆనందంగా జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనమని పేర్కొన్నారు. కనుమ పండుగ ద్వారా ఏడాది పొడవునా మన కష్టాల్లో భాగస్వాములైన పశు సంపదను పూజిస్తూ కృతజ్ఞత భావంతో పండుగను జరుపుకోవాలని తెలిపారు. భోగి మంటలు, పతంగుల పండుగ, గంగిరెద్దులు, బసవన్నలు, సన్నాయిల మేళం, చక్కని వంటకాలతో సంక్రాంతి ఉత్సవాలు ఆనందాన్ని పంచుతాయని చెప్పారు. అలాగే ఈ పండుగ సందర్భంగా క్రికెట్, కబడ్డీ వంటి క్రీడా పోటీలు, బొమ్మల కొలువులు, వివిధ సంప్రదాయ కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భగవంతుణ్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు డాక్టర్ టేకూరి నాగేశ్వరావు తెలిపారు.





# సంక్రాంతికే సంకెళ్లు!



ఫోన్లు లాక్కున్న నర్సింగ్ హాస్టల్ యాజమాన్యం
ప్రభుత్వ హాస్టల్‌లో అర్ధరాత్రి ఆంక్షలు
బాలికల హాస్టల్‌లో భయానక పరిస్థితి

## జగిత్యాల నర్సింగ్ హాస్టల్‌లో విద్యార్థినుల నిర్బంధం




**నేటి సాక్షి, జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ హాస్టల్‌లో విద్యార్థినుల ఫోన్లు లాక్కొని, సంక్రాంతి పండుగకు సొంతిళ్లకు పంపకుండా గదుల్లో నిర్బంధించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటన విద్యార్థినుల స్వేచ్ఛ, భద్రత, మానవ హక్కులపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో.. అదీ బాలికల హాస్టళ్లలో ఇలాంటి చర్యలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. పండుగ అంటే కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపే సమయం. అలాంటి వేళ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యార్థినుల వ్యక్తిగత కమ్యూనికేషన్‌ను నిలిపివేయడం, ఫోన్లు లాక్కొని నిర్బంధించడం నైతికంగానూ, పరిపాలనపరంగానూ సమర్థనీయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి దృష్టికి వెళ్లగా, ఆమె వెంటనే స్పందించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి, హిందూ విద్యార్థినులను

**సంక్రాంతి పండుగ వేళ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ హాస్టల్‌లో చోటుచేసుకున్న ఘటన కలకలం రేపింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యార్థినుల మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని, పండుగకు సొంతిళ్లకు పంపకుండా గదుల్లో నిర్బంధించడంతో విద్యార్థినుల స్వేచ్ఛ, భద్రత, మానవ హక్కులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలోనే ఈ స్థాయిలో ఆంక్షలు విధించడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.**

తక్షణమే వారి సొంత ఇళ్లకు పంపించాలని కోరినట్లు సమాచారం. దీనిపై జిల్లా వైద్యాధికారి వెంటనే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు తెలిసింది. విద్యార్థినులపై పాలకుల్లా కాకుండా సంరక్షకుల్లా వ్యవహరించాల్సిన బాధ్యత హాస్టల్ నిర్వాహకులదేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. నియమాలు ఉంటే అవి స్పష్టంగా, సమానంగా, మానవీయంగా అమలవ్వాలి. మతం, లింగం, నేపథ్యం అనే తేడాలు లేకుండా విద్యార్థినులందరికీ సమాన హక్కులు కల్పించాల్సిందే. ఈ ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్ పరిపాలనపై పర్యవేక్షణ పెంచాలని, ఫిర్యాదు వ్యవస్థలను బలోపేతం చేయాలని డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. విద్యా వ్యవస్థపై ప్రజల నమ్మకం నిలబడాలంటే.. పండుగ వేళ విద్యార్థినుల కన్నీళ్లు కాకుండా, వారి ముఖాల్లో ఆనందమే కనిపించాలి. ప్రభుత్వం తీసుకునే చర్యలే రేపటి ప్రమాణాలకు అద్దం పడతాయి.

# గోనే సల్మన్ రాజుకు నామినేట్ పదవి ఇవ్వాలి



**నేటి సాక్షి తొగుట(వడ్డే నరసింహులు):** సిద్దిపేట జిల్లా రాష్ట్రంలో 119 నియోజవర్గంలో క్రిస్టియన్ సమాజం గోనే సాల్మన్ రాజుకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో క్రైస్తవుల కోసం ఆయన జీవితం అంకితం చేసిన వ్యక్తిని గత 30 సంవత్సరాల నుండి క్రైస్తవ సమాజం చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తుల్లో మొదటి వ్యక్తి గోనే అని ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గం క్రైస్తవులు గుర్తు చేశారు. ఇప్పటికే ఎన్నో పదవులు చేపట్టాల్సిన వృత్తి కానీ ఆయన పదవుల కోసం కాక ప్రజల కోసం పనిచేస్తున్నారు. కావున ఆయన సేవలు క్రైస్తవ సమాజం మర్చిపోలేదని క్రైస్తవ సమాజం కోటి జనాభా ఉన్న మేము మాకు నాయకత్వం నాయకుడు లేడు కావున మా తరఫున సమాజం తరఫున పోరాటం చేయడానికి సమస్యలను పరిష్కరించడానికి మా నాయకుడు సల్మన్ రాజుకు వెంటనే చైర్మన్ పదవి ఇవ్వాలని దుబ్బాక నియోజకవర్గం క్రిస్టియన్ పాస్టర్ అసోసియేషన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కీలకపాత్ర పోషించిన సల్మన్ రాజుకు వెంటనే చైర్మన్ పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దుబ్బాక నియోజకవర్గం క్రిస్టియన్ పాస్టర్లు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ప్రెసిడెంట్ పాస్టర్ సత్యం పాస్టర్ దినకర్ పాస్టర్ ప్రభుదాస్ పాస్టర్ తిమోతి పాస్టర్ జీవన్ రాజ్ పాస్టర్ గిధ్యోను,పాస్టర్ మార్క్ ,పాస్టర్ నవీన్ మరియు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ముగ్గుల పోటీలు



**నేటి సాక్షి, తొగుట(వడ్డే నరసింహులు):** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంది సునీత రాజు నాయకత్వంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీల్లో గ్రామానికి చెందిన మహిళలు ఉత్సాహంగా, భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పండుగ శోభ ఉట్టిపడేలా మహిళలు రంగురంగుల అందమైన రంగవల్లులతో ఆలయ ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి జీడిపల్లి అనూష, ద్వితీయ బహుమతి వేముల లక్ష్మి ప్రసన్న, తృతీయ బహుమతి కొక్కొండ నాగలక్ష్మి గెలుచుకున్నారు. అలాగే, ప్రకృతి పరిరక్షణ సందేశానికి ప్రత్యేక బహుమతిని పాల భవాని సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పంది సునీత రాజు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఎల్లప్పుడూ సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ మహిళా కమిటీ చైర్మన్ రాయరావు అరుణ, మహిళా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బెజ్జనబోయిన అనిల్, బెజ్జనబోయిన రాములు, కల్లేపు భాను చందర్, బెజ్జనబోయిన ప్రవీణ్, ఎర్రోళ్ల అర్జున్, కల్లేపు నరేష్, పోతరాజు రవీందర్, కొయ్యడ స్వామి చరణ్, మిద్దె సంతోష్, పంది వెంకట్, సుతారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెస్సార్ కృషితోనే కరీంనగర్ అభివృద్ధి

**నేటి సాక్షి,కరీంనగర్:** మాజీ మంత్రి స్వర్గీయ ఎమ్మెస్సార్ కృషితోనే కరీంనగర్ నగరాభివృద్ధికి మార్గం సుగమమైందని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెస్సార్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. 2005లో ఎమ్మెస్సార్ చేసిన ప్రయత్నాలతోనే కరీంనగర్ నగరపాలక సంస్థగా అవతరించిందని గుర్తుచేశారు. కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు. మాజీ మంత్రి ఎమ్మెస్సార్ జయంతి సందర్భంగా రేకుర్తిలోని బుడిగ జంగాల కాలనీలో మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య ఆధ్వర్యంలో పండ్లను పంపిణీచేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో మేనేని రోహిత్ మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నాయకులు పడాల రాహుల్, వెన్న రాజమల్లయ్య, గుండాటి శ్రీనివాస్, వంగల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.






## పాములపాడులో ముత్యాల ముగ్గు పోటీలు ప్రారంభం



**నేటి సాక్షి, పాములపాడు:** నంద్యాల జిల్లా పాములపాడు మండలంలోని పాములపాడు గ్రామంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలను డీఎస్పీ రామాంజనేయ నాయక్ ప్రారంభించారు. అనంతరం మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. "పండుగలు మన జీవితంలో ఆనందం, ఐక్యత, సంప్రదాయ పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయి. మహిళలు, యువతలు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని సృజనాత్మకతను ప్రదర్శించడం అవసరం" అని తెలిపారు. బీజేపీ నాయకుడు చల్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ మన పెద్దలు, రుషులు, దేవతలు నడయాడిన భూమి అయిన భారతదేశం ఏది చేసినా ప్రజల మంచిదే కర్తవ్యంగా చేస్తుంది. ఈ తరహా కార్యక్రమాలు పిల్లలకు మన సనాతన ధర్మం, సంప్రదాయాలపై అవగాహన పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విజేత మహిళలకు ప్రత్యేక బహుమతులు, చీరలు, స్మారక అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్ కుమార్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల దామోదర్‌రెడ్డి, ఎస్సై తిరుపాల్, బీజేపీ మండల వైస్ ప్రెసిడెంట్లు గోపాలకృష్ణయ్య, హేమచంద్ర, స్థానిక కార్యకర్తలు, గ్రామంలోని మహిళలు, పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతీ మహిళకు గిఫ్ట్ చీరలు, జ్ఞాపికలు అందజేశారు.

## రైతు కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత




**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపాల్టీ పరిధిలోని గణేష్‌నగర్ కాలనీకి చెందిన వడ్డే లక్ష్మయ్య ఇటీవల మృతి చెందగా, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ప్రత్యేక చొరవతో రైతు ప్రమాద బీమా పథకం కింద రూ.5 లక్షల పరిహారం మంజూరు కాగా, దానిని బుధవారం ఎమ్మెల్యే యాదయ్య స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు కుటుంబాలకు అండగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇలాంటి క్లిష్ట సమయంలో బాధితులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అశోక్ కుమార్, చంద్రమౌళి, మల్లికార్జున్, మాజీ వార్డు సభ్యుడు మధు, పూర్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిధుల మంజూరుకు కేంద్ర మంత్రికి వినతి



**నేటి సాక్షి కరీంనగర్:** గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గునుకులకొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. మినరల్ వాటర్‌ప్లాంటు, రజక కమ్యూనిటీ భవనం, ఆరె క్షత్రియ భవనానికి ప్రహరీ, ముదిరాజ్ కమ్యూనిటీ హాలు తదితర పనులకు నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు మద్దురు మహేందర్, బట్టు సంపత్, బూట్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ గన్నేరువరం మండల ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగల శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ భోగభాగ్యాలతో, సిరిసంపదలతో ఆనం దంగా సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో నూతన కాంతులు తీసుకురావాలని, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సవాల నడుమ ఈ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.





## వాలీబాల్ పోటీల ముగింపు

**నేటి సాక్షి, తొగుట (వడ్డే నరసింహులు):** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తొగుట గ్రామంలో సర్పంచ్ పాగాల శోభ కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన యువత ఉత్సాహంగా పాల్గొని క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. పోటీల ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తొగుట సీఐ లతీఫ్ హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొగుట గ్రామ సర్పంచ్ పాగాల శోభ కొండల్ రెడ్డి, రాంపూర్ గ్రామ సర్పంచ్ లచ్చోళ్ల రవి, ఉపసర్పంచ్లు బండారు తిరుపతి, నాగరాజు, మ్యాకల రమేష్, కాంగ్రెస్ తొగుట అధ్యక్షుడు భరత్ తేజ, వార్డు సభ్యులు దేవేందర్, అభి, కొమ్మర పవన్, వినోద్, అనిల్‌తో పాటు తొగుట యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సొంత నిధులతో బోరు వేయించిన మాజీ కౌన్సిలర్ చాకలి అశోక్



**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని షర్ఫుద్దీన్ బాబా దర్గా సమీపంలో ఏడవ వార్డు మాజీ కౌన్సిలర్ చాకలి అశోక్ తన సొంత నిధులతో బోరు వేయించి నీటి సమస్యకు పరిష్కారం చూపించారు. బుధవారం బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చాకలి అశోక్ మాట్లాడుతూ, గత వారం రోజులుగా ఈ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యను గుర్తించి వెంటనే స్పందించి, తన సొంత నిధులు వెచ్చించి నూతన బోరు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే నీటి సమస్యపై స్పందించిన అశోక్‌కు వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా వార్డు పరిధిలో మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే, వాటిని శాశ్వతంగా పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ బి. వెంకట్రాం రెడ్డి, నాయకులు ఇస్మాయిల్, రహీం, హమీద్, అహమ్మద్, బాలు, జైనులుద్దీన్, మోయిన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రామకృష్ణారెడ్డి జయంతి



**నేటి సాక్షి, చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలో చిత్తూరు మాజీ ఎంపీ, దివంగత నూతన కాలువ రామకృష్ణారెడ్డి జయంతి వేడుకలను బుధవారం చౌడేపల్లి బస్టాండ్‌లో ఘనంగా నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం బస్టాండ్‌లోని రామకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పుంగనూరు, చిత్తూరు ప్రాంతాల అభివృద్ధికి దివంగత నూతన కాలువ రామకృష్ణారెడ్డి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పూల చంద్రమౌళి, నారాయణ రాజు, గిరి నాయుడు, పవన్ కుమార్, పంజాని పల్లి బాబు నాయుడు, చంగల్ రాయుడు, కుమార్ రెడ్డి, వెంకటరమణ, అర్జున్ రాయల్, ప్రభాకర, రమేష్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చుక్కావారిపల్లిలో గడ్డివాము దగ్ధం

**నేటి సాక్షి, చౌడేపల్లి:** చౌడేపల్లి మండలంలోని పందిల్లపల్లి పంచాయతీ పరిధిలోని చుక్కావారి పల్లిలో గడ్డివాము పూర్తిగా దగ్ధమై సుమారు రూ.50 వేల మేర ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన ఆమూరు మురళికి చెందిన గడ్డివాము వద్ద బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా పొగలు వెలువడటంతో గ్రామస్తులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. అయితే మంటలు వేగంగా వ్యాపించడంతో వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. పుంగనూరు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా ప్రయత్నించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే గడ్డివాము పూర్తిగా కాలిపోయి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల మేర నష్టం సంభవించినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు.

# రక్తదాన శిబిరం విజయవంతం

### సర్పంచ్ మల్లేశ్వర రెడ్డి ప్రశంసలు



**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండలంలోని లింగాల గ్రామంలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా లింగాల గ్రామ యూత్ ఆర్గనైజర్స్ ఎం. అశోక్, ఎం. శంకర్ ఆధ్వర్యంలో అక్షయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లింగాల గ్రామ సర్పంచ్ మల్లేశ్వర రెడ్డి, దేశపోరాటం తెలుగు దినపత్రిక సంస్థ యజమాని తుపాకుల రమేష్ హాజరయ్యారు. ఎస్సై పి. తిరుపాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లింగాల యూత్ నవీన్ గౌడ్ రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. వక్తలు మాట్లాడుతూ



సంక్రాంతి పండుగ రైతులకు ఆనందాన్ని ఇచ్చే గొప్ప పండుగని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీ స్త్రీలు, ఆపరేషన్‌లు, ప్రమాదాల సమయంలో రక్తం ఎంతో అవసరమని, అందుకే సమాజ సేవగా రక్తదానం చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని, లింగాల గ్రామ యూత్ సేవాభావాన్ని ప్రశంసించారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో లింగాల గ్రామం ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా భారతదేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. భోగిపండ్లు, రంగవల్లులు, గంగిరెద్దులు, హరిదాసుల కీర్తనలు, పిండివంటలతో పండుగలు ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. కనుమ పండుగ ద్వారా పశు సంపదకు ప్రాధాన్యతను గుర్తు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హోటల్ రమణమ్మ, మైల అశోక్, మధన్, రమేష్, శివ, పరమేష్, భార్గవి, లింగస్వామి గౌడ్, అక్షయ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, కటారి ప్రతాప్ బృందం, గ్రామ యువత పాల్గొన్నారు.

# పల్లె శోభకు ప్రతీక సంక్రాంతి

### మైలారంలో ముగ్గుల పోటీ

### ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** సంక్రాంతి పండుగ పల్లె శోభకు, భారతీయ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని డా. బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత, యువ న్యాయవాది జక్కనపల్లి గణేష్ అన్నారు. బుధవారం మైలారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో చిన్నారులు, మహిళల కోసం ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు రంగురంగుల ముగ్గులతో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగ శోభను అద్దారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జక్కనపల్లి గణేష్ మాట్లాడుతూ పండుగలు ప్రజల జీవితాల్లో ఆనందం, ఆహ్లాదాన్ని నింపుతాయని తెలిపారు. ముగ్గులు గృహాలకు అందాన్ని చేకూర్చడమే కాకుండా, ఆ కుటుంబాలకు గౌరవాన్ని తీసుకువస్తాయని అన్నారు. పల్లె సంస్కృతి, సంప్రదాయాలు మానవ జీవితాన్ని ప్రతిబింబిస్తాయని, రైతుల శ్రమ ఫలితంగా వచ్చే పంటలు ఇంటికి చేరే సంక్రాంతి పండుగ కుటుంబాలకు సంతోషాన్ని అందించే పండుగగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మైసంపల్లి తిరుపతి, జక్కనపల్లి కవిత, జక్కనపల్లి



లక్ష్మి, మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ వరాల పరుశరాములు, మాజీ ఎంపీటీసీ పురంశెట్టి బాలయ్య, మాజీ సర్పంచ్ జక్కనపల్లి సత్తయ్య, యూత్ క్లబ్ సభ్యులు జక్కనపల్లి వేణు, జక్కనపల్లి సతీష్, వెధిర చంటి, జక్కనపల్లి రాకేష్, జక్కనపల్లి హరీష్, గ్రామ పెద్దలు మైసంపల్లి మల్లేశం, కుంట లక్ష్మణ్, బద్ధం శ్రీనివాస్ రెడ్డి, గంగిపల్లి శంకర్, పులి రామకృష్ణ, వరాల సతీష్, అంగన్వాడీ కార్యకర్త మైసంపల్లి సుమలత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య
- శంకర్‌పల్లిలో 'అరైవ్ అలీవ్ కార్యక్రమం



**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** వాహనదారులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి తమ ప్రాణాలను కాపాడుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచించారు. బుధవారం శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్తంగా రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'అరైవ్ అలీవ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దని హెచ్చరించారు. అధిక వేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని, ప్రతి వాహనదారుడు వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. పోలీసులు సూచించే రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకొని పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగుచక్రాల వాహనాలు నడిపే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ ఏసీపీ కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు 'అరైవ్ అలీవ్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అధిక వేగంతో వాహనాలు నడిపితే ప్రమాదాల ముప్పు తప్పదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు ఇకపై తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని, హెల్మెట్ లేకుంటే ఆయా కార్యాలయాల వద్దకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'నో హెల్మెట్–నో ఎంట్రీ' లోగోను ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆవిష్కరించారు. అనంతరం వాహనాలు వేగ నియంత్రణలో నడుపుతామని హాజరైన వారితో సీఐ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ గౌడ్, శంకర్‌పల్లి ఏఎంసీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్ రెడ్డి, మార్కెట్ సెక్రటరీ, పలు గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలు




**నేటి సాక్షి, పాములపాడు:** నంద్యాల జిల్లా పాములపాడు మండలం రుద్రవరం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హుస్సేన్ భాష ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు గ్రామ మహిళల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన మొత్తం 14 మంది మహిళలు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలు జరుగనున్న దేవాలయ ప్రాంగణానికి మహిళలు ఉదయం 3 గంటలకే చేరుకుని ఉత్సాహంగా సిద్ధమయ్యారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ముగ్గుల పోటీలు సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగాయి. కొందరు మహిళలు ఆలస్యంగా హాజరైనప్పటికీ తమ అందమైన, సృజనాత్మక ముగ్గులతో అందరినీ ఆకట్టుకున్నారు. ప్రతి ముగ్గా ప్రత్యేకతను చాటుతూ సంక్రాంతి పండుగ శోభను ప్రతిబింబించింది. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేయడంలో న్యాయనిర్ణేతలు తీవ్రంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రంగురంగుల ముగ్గులు, సంప్రదాయ అలంకరణలతో దేవాలయ ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. అనంతరం విజేతలకు హుస్సేన్ భాష బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామస్వామి, మాజీ సర్పంచ్ రామసుబ్బయ్య, నారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు హుస్సేన్ భాష, బీజేపీ మండల అధ్యక్షులు మురళీ మోహన్, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ వేణు, పెద్దబి గౌడ్, బుడ్డన గౌడ్, మల్లికార్జున, గ్రామ టెంపుల్ యూత్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అనుప్పల్లిలో హోరెత్తించిన ఊజల్లికట్టు



- రంకెలేసి దుమ్ము రేపిన కోడె గిత్తలు
- పట్టీల కోసం యువకుల కుస్తీలు.. పలువురికి స్వల్ప గాయాలు

**నేటి సాక్షి, రామచంద్రాపురం:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం అనుప్పల్లి గ్రామంలో భోగి పండుగ రోజున నిర్వహించిన ఊజల్లికట్టు ఉత్సవాలు హెూరెత్తాయి. ప్రతి ఏటా ఆనవాయితీగా జరిగే ఈ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, యువత తరలివచ్చారు. రైతులు ఉదయాన్నే తమ కోడె గిత్తలను రంగురంగుల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. గిత్తల కొమ్ములకు వివిధ దేవతామూర్తులు, తమ అభిమాన నాయకుల ఫోటోలతో కూడిన పట్టీలను కట్టి డప్పులు మోగిస్తూ జనసమూహంలోకి విడిచిపెట్టారు. రంకులేస్తూ పరుగులు తీసిన కోడె గిత్తలు గ్రామాన్ని దుమ్మురేపగా, వాటిని నిలువరించి పట్టీలను సొంతం చేసుకునేందుకు యువకులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. కోడె గిత్తలకుపట్టీల కోసం యువత మధ్య కుస్తీలు నెలకొనడంతో ఉత్సవ ప్రాంగణం ఉత్కంఠభరితంగా మారింది. ఈ క్రమంలో పలువురు యువకులకు స్వల్ప గాయాలు అయినప్పటికీ, సంప్రదాయ ఉత్సవాన్ని వీక్షించేందుకు వచ్చిన జనాలు సంబరాల్లో మునిగిపోయారు. పల్లె సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ ఊజల్లికట్టు కార్యక్రమం భోగి పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అనుప్పల్లి గ్రామాన్ని పండుగ శోభతో నింపింది.

# రంగోలి సంబరాలు



**నేటి సాక్షి రామచంద్రాపురం:** భోగి, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని రామచంద్రాపురం మండలం నడవలూరు గ్రామంలో మహిళల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేలా భోగి రంగోలి పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం పండుగ శోభను మరింత రెట్టింపు చేసింది. గ్రామంలో ఏర్పాటు చేసిన రంగోలి పోటీలకు మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ కళాత్మక ప్రతిభను చాటుకున్నారు. రంగుల సమ్మేళనాలతో వేసిన అందమైన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. సంప్రదాయాలు, పల్లె సంస్కృతిని కాపాడుతూ భోగి పండుగను ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు, చిన్నారులకు ప్రత్యేక పురస్కారాలుగా స్వీట్ బాక్స్‌లు, వివేకానంద పుస్తకాలు, నగదు బహుమతులు అందజేశారు. మహిళలను అభినందిస్తూ మాట్లాడుతూ, భోగి--సంక్రాంతి పండుగను మహిళల భాగస్వామ్యంతో సంప్రదాయబద్ధంగా జరుపుకోవడమే లక్ష్యమని, మహిళల కళాత్మక నైపుణ్యాన్ని ప్రోత్సహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ రంగోలి పోటీలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చడమే కాకుండా, మహిళలకు ఒక మరపురాని అనుభూతిని అందించాయని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మైలారం ముందలి తండాలో వాలీబాల్ టోర్నమెంట్





**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా ధరూర్ మండలంలోని మైలారం ముందలి తండాలో బుధవారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను సర్పంచ్ శాంతి బాయ్ దేవేందర్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడం, యువతను మత్తుపదార్థాలు, అసాంఘిక కార్యకలాపాల నుంచి దూరంగా ఉంచడం మా లక్ష్యం. క్రీడలు శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, ఐక్యత పెంచుతాయి. భవిష్యత్తులో మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తాం" అని అన్నారు. టోర్నమెంట్‌లో చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక జట్లు పాల్గొని ఉత్కంఠభరితంగా పోటీపడ్డాయి. ఫైనల్ మ్యాచ్ ముగిసిన తర్వాత విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై, టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు. గ్రామస్తులు సర్పంచ్ శాంతి బాయ్ దేవేందర్ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి క్రీడా కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్ కుమార్, రాజు నాయక్, వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కమ్మపల్లిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

- సంస్కృతి సంప్రదాయాలు అద్దం పట్టే విధంగా గ్రామస్తులు పండుగ



**నేటి సాక్షి, రామచంద్రాపురం:** రామచంద్రాపురం మండలంలోని కమ్మపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాదీ విధంగా గ్రామస్తులు సంప్రదాయాలను ప్రాతిపదికన ఉంచి, భోగి వేడుకలు, హరిదాసు, గొబ్బెయ్యాలు, కోలాటాలు, గంగిరెద్దులు వంటి అనేక సాంప్రదాయాలను ఆచరించారు. విదేశాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉన్న పల్లెవాసులు కూడా ఈ సందర్భానికి చేరుకుని, తల్లిదండ్రులు, బంధుమిత్రులతో కలసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. వేకువలా భోగి మంటలు ఆవిష్కరించగా, గ్రామం సంబర వాతావరణంలో నిండిపోయింది. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చినబాబు మాట్లాడుతూ, "ఎప్పటినుంచో వస్తున్న సంక్రాంతి సంప్రదాయాలను మరవకుండా ఉంచే విధంగా ప్రతి ఏడాదీ ఈ పండుగ ఘనంగా జరుపుకుంటున్నాం. గ్రామస్తులు మరియు వీర కుటుంబాలు కలిసి సంప్రదాయాలను ప్రోత్సహిస్తున్నారు" అని అన్నారు. గ్రామంలో జరిగే ఈ ఉత్సవాలను చూడటానికి పెద్ద సంఖ్యలో ప్రజలు సమాగమించడంతో గ్రామ పల్లె మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయిందని చినబాబు పేర్కొన్నారు.



# వాహనాల తనిఖీ చేపట్టిన మేడిపల్లి ఎస్సై

**నేటి సాక్షి, మేడిపల్లి :** మేడిపల్లి మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు నిర్వహించిన మేడిపల్లి ఎస్సై మాడ శ్రీధర్ రెడ్డి, తనిఖీలలో భాగంగా రిజిస్ట్రేషన్ లేని వాహనాలను పోలీస్ స్టేషన్ కి తరలించారు. మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడ్డ యువకులకు హెల్మెట్ లేకుండా జరిగే ప్రమాదాల గురించి వాహన దారులకి తెలియజేసారు. రిజిస్ట్రేషన్ లేని వాహనాల వల్ల కలిగేనష్టాలను వివరించారు. ఈ తనిఖీలలో ఎస్సై తో పాటు కానిస్టేబుల్ సత్యం, పాల్గొన్నారు.



# ఘనంగా సంక్రాంతి సంబరాలు

**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామాల్లో భోగి--సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో అందంగా అలంకరించారు. గ్రామాలంతా పండుగ శోభతో కళకళలాడాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఉండటంతో పిల్లలు గాలిపటాలు ఎగరవేస్తూ ఆనందంగా కేరింతలు కొట్టారు. మహిళలు ఇంటింటా సకినాలు, గారెలు, కారపూసలు, లడ్డూలు, అరిసెలు వంటి సంప్రదాయ పిండివంటలను తయారు చేసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, గ్రామీణ క్రీడలు నిర్వహించడంతో పండుగ సందడి మరింత పెరిగింది. ఈ కార్యక్రమాల్లో మహిళలు గూడెం శిరీష, బుర్ర అరుణ, వర్షిత, శోభ, ఐషు, వైష్ణవి, వర్షిని తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష



**నేటి సాక్షి, కరీంనగర్:** త్వరలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఓటర్ల జాబితాపై వారి నుంచి పలు సలహాలు, సూచనలను స్వీకరించారు. ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్‌తో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా గోదా రంగనాథ కళ్యాణం



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలం నేదునూరు గ్రామంలో గల గోదారంగనాథ స్వామి కళ్యాణం బుధవారం ఘనంగా జరిగింది. వేడుకలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కళ్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఒంటెల శ్రీనివాస్ రెడ్డి, నారాయణరెడ్డి, మల్లారెడ్డి, రవీందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, పాతిరెడ్డి రాజిరెడ్డి, నేదునూరు సంపత్, నేదునూరు సది, కాల్వ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హ్యాపీ సంక్రాంతి సర్..

## సీఎం చంద్రబాబుకు చిత్తూరు ఎంపీ శుభాకాంక్షలు

**నేటి సాక్షి చంద్రగిరి:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వగ్రామం నారావారి పల్లెలకు బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు సీఎం నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. చిరచెల్లన ఆనందంగా వారు పుష్పగుచ్ఛాలు అర్పించి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామీయ వాతావరణంలో ఆనందంతో కూడిన సంప్రదాయ పండుగ పర్వదినం భావం ప్రతిఫలించిందని అధికారులు పేర్కొన్నారు.

